ఆదివారం

ప్రజాశక్తి

మార్చి 14, 2004



అమర ప్రేమకు 350 ఏళ్ళు

హ్యాపీ బర్త్‌డే

(14-3-2004నుండి 20-3-2004వరకు)

నందిని
5సం॥,13.3.1999
కృష్ణవేణి-ప్రసాద్
ఆకివీడు-ప॥గో

జి. లక్ష్మీప్రసన్న
7సం॥,13.3.1997
అనసూయ-భార్గవయ్య
నాగర్‌గూడ-రంగారెడ్డి

అవినాష్
2సం॥,15.3.2002
లత-రాములు
కవాడిగూడ-హైదరాబాద్

సంపత్ కుమార్ రెడ్డి
7సం॥,16.3.1997
వీణ-వెంకట్‌రెడ్డి
సనత్‌నగర్-హైదరాబాద్

టి. మనోజ్ఞ
మార్చి-16
లక్ష్మీశ్వరి-వీరాచారి
యర్రగొండపాలెం-ప్రకాశం

ఎస్.కె. ఇర్ఫాన్
8సం॥,16.3.1996
షకిలా-గౌస్‌బాషా
వెంకటేశ్వరపురం-నెల్లూరు

పరంజ్యోతి
7సం॥, మార్చి-1997
శ్యామల-రఘుపతి
ఆరుట్ల-రంగారెడ్డి

పూర్ణచంద్రరావు
1సం॥,19.3.2003
పార్వతి-అప్పారావు
సీతన్నపేట-విజయవాడ

ప్రీతికా వైష్ణవి
1సం॥,20.3.2003
లావణ్య-శేఖర్‌బాబు
సిల్వస్సా-గుజరాత్

విష్ణు(సోను)
1సం॥, మార్చి-2003
సుజాత-మల్లేష్
జియాగుడ-హైదరాబాద్

కావ్యశ్రీ
1సం॥, మార్చి-2003
లక్ష్మి-శంకర్
అంకమ్మనగర్-గుంటూరు

బి. దివ్య
కృష్ణవేణి-నాగేశ్వరరావు
రెబ్బవరం-ఖమ్మం

ఆశిష్
6సం॥, మార్చి-1998
వసంత-సాంబయ్యగౌడ్
కల్వకుర్తి-మ॥నగర్

జయంతి
10సం॥, మార్చి-1994
ధనమ్మ-పెంచలయ్య
జూబ్లీహిల్స్-హైదరాబాద్

మంజూష
5సం॥, మార్చి-1999
జయలక్ష్మి-ప్రసాద్
విజయవాడ-కృష్ణ

వైష్ణవి
1సం॥, మార్చి-2003
భాగ్యలక్ష్మి-ప్రభాకర్
బెల్లంపల్లి-ఆదిలాబాద్

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



రహస్య కెమెరాల గురించి తెలిసింది

మీడియా ఉపయోగించే రహస్య కెమెరాల గురించి ఫిబ్రవరి 29వ తేదీ ఆదివారం పుస్తకంలో కవర్‌స్టోరీగా రాసినందుకు ధన్యవాదాలు. ఇంతవరకు వాటి గురించి వినడమే గాని తెలియని మాకు కవర్‌స్టోరీ చదివాక అమెరికా లాంటి దేశాల్లో ఆధునిక విజ్ఞానాన్ని ఎంతగా దుర్వినియోగం చేస్తున్నారో అర్థమయింది. ఇటువంటి ఆసక్తి కలిగించే, మంచి సమాచారాన్ని ఇచ్చే కవర్ స్టోరీలను ప్రచురిస్తున్నందుకు ప్రజాశక్తికి మా ధన్యవాదాలు.

– వి. నాగేశ్వరరావు,
వి. సుబ్రమణ్యేశ్వరరావు,
మంగళగిరి, గుంటూరు జిల్లా.
– కె. ఉమామల్లేశ్వరరావు,
గుడివాడ, కృష్ణా జిల్లా
యు. శివశంకరరావు, విశాఖపట్టణం

విశ్వసుందరీమణులపై వ్యంగ్యాస్త్రం

విశ్వసుందరీమణుల పేరుతో ప్రచారం చేసుకునే వారు నిజంగా పేద ప్రజల గురించి పట్టించుకోరు. కేవలం ప్రచారం కోసమే నటిస్తారు. విశ్వసుందరిల ప్రథమ లక్ష్యం, అంతిమ లక్ష్యం సినిమాల్లోనూ, మోడల్స్‌గానూ రాణించడమే.. ఇదంతా పదేళ్ళ నుండి చూస్తూనే ఉన్నాము. అంటువంటి వారి గురించి వ్యంగ్యంగా రాసిన కథ బాగుంది. దాన్ని ప్రచురించినందుకు అభినందనలు. ఇటీవల కాలంలో ప్రచురిస్తున్న 'నారు' కార్టూన్లు అర్థవంతంగా ఉంటున్నాయి.

కె. మహాలక్ష్మి, కాకినాడ, తూ.గో.
ఎం. కృష్ణవేణి, కర్నూల్.

హృదయ స్పందన కలిగించిన రియల్‌స్టోరీ

ఫిబ్రవరి 29 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన రియల్‌స్టోరీలో చూస్తే 'బికారి నోటి నుంచి కవితా ఝురి' చదివిన తరువాత ఎంతో ఆశ్చర్యం కలిగించింది. మరో శ్రీశ్రీ గారు జన్మించారేమో అనిపించింది. "ఈ దుష్ట సమాజం మీద స్వరూప్‌కుమార్ ఆవేదన, కవితావేశం ఆయన అనుభవాలు, సమస్యలు వెలుగులోకి తీసుకువచ్చి పాఠకులకు చాలా చక్కగా ప్రెజెంట్ చేసిన పిడుగు సుబ్బరాయుడు, మట్టయ్య, ప్రజాశక్తికి అభినందనలు తెలియజేస్తున్నాం. ఇక ముందు ప్రజాశక్తిలో ఆయన కవితలు ప్రచురించే విధంగా కృషి చేస్తారని ఆశిస్తున్నాం.

– ఎం.నర్సింగరావు, ఎం.జయంతి,
గాజువాక, విశాఖపట్నం.



టూరిస్ట్‌గైడ్ బాగుంది

29 ఫిబ్రవరి ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో టూరిస్ట్‌గైడ్ శీర్షికన ప్రచురించిన ప్రాచీన ఆలయాలు పచ్చని అడవుల కడప ప్రాచీన ఆలయాలు ఆనందాన్ని కలిగించింది అని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదనిపిస్తోంది. ఇంతమంచి శీర్షిక అందించిన ప్రజాశక్తికి అభినందనలు.

– మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

ఆనందించాము

29-2-2004 ఆదివారం ప్రజాశక్తిలోని బాలనేస్తాలు పేజీ చాలా బాగుంది. ఇది ఫైల్ చేసుకోవడానికి వీలుగా మధ్య పేజీలో ఇస్తున్నందుకు థాంక్స్. బాలనేస్తాలులోని క్విజ్ బాగుంటోంది. 'రుచిలోని సమాసాలు, జాంగ్రీలు తెలుసున్నవే అయినా చదివి ఆనందించాం.

– పి.ఎస్.ఎస్.కిరణ్,
రామచంద్రాపురం, ప.గో.జిల్లా

మెదళ్ళు తింటారు జాగ్రత్త...!

కొందరికి మేక మెదడుందంటారు..

కొందరికి మెదడు మోకాలిలో ఉందంటారు..

ఇవన్నీ వాళ్ళ తెలివితేటలను బట్టి స్నేహితులు, తెలిసినవాళ్ళు ఆటపట్టించడానికి అనే మాటలు..

'వీడు మెదడు తింటాడురా' అని కొందరి దగ్గరకు వెళ్ళడానికే భయపడ్తుంటారు...

మనిషి కనిపించగానే సుత్తి కొట్టి హింసించే వారిని ఈ కేటగిరీలో చేరుస్తారని ఫ్రెండ్ చెప్పేవాడు..

కొన్నేళ్ళ క్రితం ఉగాండా అనే ఆఫ్రికా దేశంలో దేశాధ్యక్షుడే నరమాంస భక్షణ చేసేవాడని విన్నాం.. ప్రత్యేకించి మెదళ్ళు, గుండె భాగాలను ఫ్రై చేసుకుని తినేవాడట! అదొక భయంకర వాస్తవం...

మొన్నీ మధ్యన నరమాంస భక్షకుల వెబ్‌సైట్ గురించి పత్రికల్లో వార్తలొచ్చాయి....

రోగాల బాధలు పడలేని వారు దయతో తమను చంపండి అని డాక్టర్లను వేడుకుంటే పాశ్చాత్య దేశాల్లో విషం ఇంజక్షన్ల ద్వారా చంపడానికి వీలుంది... దీన్ని మెర్సీ కిల్లింగ్ అని పిలుస్తున్నారు..

మన రాష్ట్రంలో కూడా మనిషిని చంపి మెదడు తిన్న ఉన్మాది గురించి పత్రికల్లో చదివాము..

ఈ బాపతునంతా మనుషుల్ని శారీరకంగా చంపి ఆరగించే నరరూప రాక్షసులుగా చెబుతారు...

అయితే మొదటే చెప్పుకున్నట్లు సుత్తి వీరభద్రరావు టైపులో మనుషుల్ని నించోబెట్టి మాటలతో మెదడు తినేసేవాళ్ళు మనకు నిత్యం కనిపిస్తూనే ఉంటారు.

వీళ్ళు మనింట్లో మనతోనే బంధువుల రూపంలో ఉండవచ్చు... స్నేహితుల రూపంలో ఉండవచ్చు... ఆఫీసుల్లో సహోద్యోగుల రూపంలోనో, బాసుల రూపంలో కూడా ఉండవచ్చు...

ఎవరికి ఏ రూపంలో కనిపిస్తారో అనుభవం ద్వారానే తెలుస్తుంది... కనుక ఫలానా రూపంలోనే ఉంటారని చెప్పడం కుదరదు...

వీళ్ళను చూస్తే ఎవరైనా ఆమడ దూరం పారిపోతారు..

సో.. మనిషిని చంపి తినేవారు ఎంత ప్రమాదకారులో మానసికంగా హింసించి మెదడు తినేవారు కూడా అంతే ప్రమాదకారులు...

కాబట్టి... మెదళ్ళు తినేవారికి దూరంగా ఉండటం మంచిదే కదూ??

ఈ సంచికలో . . .

ఓరా! . . . 3
కార్టూన్ కదంబం... . . . 4
కవర్ స్టోరీ . . . 5
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
రియల్‌స్టోరీ . . . 14
ఇంతిసంగతులు . . . 16
కచేరి . . . 17
ఆరోగ్యం . . . 18
పుస్తక పరిచయం . . . 20
న్యాయసలహాలు . . . 24

ఇంకా...

పిడికిళ్ళెత్తినాం!
కథ...8, 9, 10

ఇంత అసమానత న్యాయమేనా!
జీవనశైలి...15



అందమైన సముద్రతీరాలు ఆహ్లాదపరిచే వలసపక్షులు
టూరిస్ట్ గైడ్ . . . 21

'కళ'తో మానసిక వైకల్యాన్ని జయించిన చంద్రశేఖర్
కళాసాహితి . . . 22, 23

ఔరా!

నమస్తే! అంతా బాగుంది!?

అంతా బాగుందంటూ భారతీయ జనతాపార్టీ నేతలు చేస్తున్న ప్రచారానికి తోడుగా తాను ఎంతోకొంత సేవ చేయాలని కేంద్ర పర్యాటకాభివృద్ధి సంస్థ తలపెట్టింది. అనుకున్నదే తడవుగా ఢిల్లీ రైల్వే స్టేషన్లలోని 200 మంది కూలీలకు, 60 మంది టాక్సీ డ్రైవర్లకు, 60 మంది ఆటో డ్రైవర్లకు ఒకరోజు వర్క్‌షాప్ ఏర్పాటు చేసింది. దేశ రాజధానికి వచ్చే పర్యాటకులను చిరునవ్వుతో ఆహ్వానించడం, వారితో మర్యాదగా మెలగడం, అంతా బాగుందని చెప్పడం గురించి నేర్పారట! దీంతో వారంతా మర్యాదరామన్నలుగా మారిపోయారని పర్యాటక శాఖ సర్టిఫికెట్లు కూడా జారీచేసింది! వర్క్‌షాప్‌లో పాల్గొన్నవారికి టీ, బిస్కట్లు, ఒక సర్టిఫికెట్, ఆ రోజు ఆదాయం నష్టపోయినందుకు 50 రూపాయలు ఇచ్చి పంపించారట! ఇవన్నీ బాగానే ఉన్నాయి గాని ఢిల్లీలోని రైల్వే కూలీలు, ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు మర్యాద తెలియదని అక్కడి అధికారులు తీర్మానించుకోవడం ఏమైనా మర్యాదగా ఉందా?

ఎయిడ్స్ దాచినందుకు భారీ జరిమానా

ఇటీవల అమెరికాలోని ఓ కోర్టు ఎయిడ్స్ కేసులో 20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ ఒక సంచలన తీర్పు వెలువరించింది. ప్రపంచ ఎయిడ్స్ కేసుల చరిత్రలో ఇదే అతిపెద్ద జరిమానా అని న్యాయపండితులు అంటున్నారు. తన ప్రియునికి ఎయిడ్స్ రోగం ఉన్నా చెప్పకుండా దాచి తన జీవితాన్ని బలితీసుకున్నారని ఒక మహిళ అతని తల్లిదండ్రులపై కోర్టులో వేసిన కేసుకు గాను ఆమెకు నష్టపరిహారం చెల్లించవలసిందిగా కోర్టు తీర్పు చెప్పింది. ఆమె ప్రియుడు ఆల్బర్ట్ డిల్లింగ్ 1999 నవంబర్ 2వ తేదీన ఎయిడ్స్‌తో చనిపోయాడు. ఆ మహిళ 1996 నుండి డిల్లింగ్‌తో డేటింగ్ చేస్తోంది. అనేకసార్లు జబ్బుపడిన డిల్లింగ్ చివరకు మృతిచెందాడు. అతని జబ్బుకు చికిత్స చేయిస్తున్న తల్లిదండ్రులు తనకు ఆ విషయం చెప్పకుండా తన జీవితాన్ని బలిచేశారని ఆమె కోర్టుకెక్కి 45 లక్షల డాలర్ల నష్టపరిహారం కోరింది. కేసు విచారించిన ఇల్లినాయిస్ రాష్ట్రంలోని ఆ కోర్టు 20 లక్షల డాలర్లు చెల్లించాలని డిల్లింగ్ తల్లిదండ్రులను ఆదేశించింది. తమ కుమారుడికి ఎయిడ్స్ ఉన్నట్లు తమకు తెలియదని హెవీ-మెటల్ పాయిజనింగ్ జబ్బుగా వైద్యులు చెప్పారని ఎయిడ్స్ పరీక్ష చేయలేదని వారు చెబుతున్నారు. అంత గొప్పగా అభివృద్ధి చెందిన అమెరికాలోనే నాలుగేళ్ళుగా మంచాన పడి లేస్తున్న ఒక రోగికి ఎయిడ్స్ పరీక్ష చేయలేదట! అతను చనిపోయాకే ఎయిడ్స్ అని తేల్చారట! ఆ మహమ్మారి పట్ల అమెరికాలోనే అవగాహన అలా ఉందంటే ఇక మన పరిస్థితి ఎలా ఉంటుంది?!



హిమాచల్‌లో లామా మమ్మీ

ఇటీవల హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం ఎగువ ప్రాంతంలోని ఒక గ్రామంలో 500 సంవత్సరాల నాటి బౌద్ధగురువు లామా మమ్మీ ఒకటి బయటపడింది. తను నివసిస్తున్న గ్రామ ప్రజలను మంచు తుపాను బారి నుండి కాపాడే ప్రయత్నంలో ఆయన తనువు చాలించారని చారిత్రిక పరిశోధకులు అంటున్నారు. ఇన్నేళ్ళ తర్వాత ఆ మంచుకొండల్లో మమ్మీ రూపంలో లామా భౌతికకాయం కనిపించడంతో అక్కడి బౌద్ధుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఆ మమ్మీని భద్రపరచడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

కార్టూన్ కదంబం


దాంతో మాకు సంబంధం లేదు
మాది ఎన్‌డిఏ ఎజెండా
అయోధ్య
నారు


ఓటు
భారత్ ఉదయ యాత్ర


ఓటు
లైట్స్... కెమెరా...
మైక్... స్పీచ్...
స్టార్ట్!
రాజకీయాల్లో సినిమా తారలు



అమరప్రేమకు 350 ఏళ్ళు

సింహాద్రి సరోజిని

అదొక అద్భుత పాలరాతి మందిరం. ఆ పేరు వింటేనే హృదయం పులకిస్తుంది. దాని అందాలను వర్ణించడానికి ఏ పదాలూ సరిపోవంటే అతిశయోక్తి కాదు. ఆ కట్టడం ఉన్న కాంప్లెక్స్‌లోకి అడుగు పెట్టగానే అదేదో అద్భుత లోకంలోకి వచ్చిన భావన కలుగుతుంది. దాని అందాలకు ప్రపంచంలోని ఏ ఇతర అందాలూ సాటిరావు. అదే మొఘల్ చక్రవర్తి షాజహాన్ తన భార్య ముంతాజ్‌కు ప్రేమ పూర్వకంగా నిర్మించిన స్మృతి చిహ్నం తాజ్‌మహల్. తాజ్‌మహల్‌ను వెన్నెల్లో వీక్షించడం అదో అద్భుత అనుభూతి. జీవితకాలం గుర్తుండిపోయే తీపి గుర్తు. వెన్నెల్లో ఆ మందిరం మెరిసిపోవడాన్ని చూసి తీరవలసిందే తప్ప వర్ణించజాలము. ప్రపంచంలోనే ఎక్కడా ఇంతటి అందాల పాలరాతి కట్టడం లేదు. దీనిని నిర్మించి 350 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ముఖచిత్ర కథనం.

గత 350 సంవత్సరాలుగా తాజ్‌మహల్ ప్రేమికులకు అద్భుత అనుభూతులను అందించింది. కవులను ఉత్తేజపరచింది. కళాకారులను కదిలించింది. లక్షలాది మంది పర్యాటకులను తన దగ్గరకు లాక్కొచ్చింది.

తాజ్‌మహల్‌ను ఇంత అందంగా తీర్చిదిద్దడానికి 22 సంవత్సరాలు పట్టింది. దీని నిర్మాణం కోసం భారతదేశం, ఆసియాలోని అనేక ప్రాంతాల నుంచి సామగ్రిని సమకూర్చుకున్నారు. ఈ కట్టడంలో ఉపయోగించిన ఎర్ర రాతిని సమీపంలోని ఫతేపూర్ సిక్రీ, కరౌలీ - హిండాన్, తాంతపూర్, పహార్‌పూర్ నుంచి తెచ్చారు. దీనికి ఉపయోగించిన పాలరాతి రాజస్థాన్‌లోని మక్రానా నుంచి తెప్పించారు. అమూల్యమైన, అరుదైన రాళ్ళను టిబెట్, కుమోన్, జైసల్మేర్, కాంబే, సిలోన్ వంటి సుదూర ప్రాంతాల నుంచి సేకరించారు. సుమారు 28 రకాల అమూల్యమైన, అరుదైన రాళ్ళను ఈ పాలరాతి కట్టడంలో పొదిగారు. దీనికి సామగ్రి, కార్మికుల వేతనాలు మొత్తం కలిపి అప్పటి రోజుల్లోనే 4.2 కోట్ల రూపాయలు ఖర్చయి ఉంటుందని కొందరు అంచనా కట్టారు.

ఇందులో ప్రధానంగా మనకు ఐదు రకాలైన అంశాలు కన్పిస్తాయి. వాటిలో మొదటిది దర్వాజా లేదా ప్రవేశ మార్గం. రెండవది తోటలు లేదా బగీచా. మూడవది మసీదు. నాల్గవది నక్కర్‌ఖానా లేక రెస్ట్‌హౌస్. ఇక ఐదవది రౌజా లేక మసోలియం. తాజ్‌మహల్‌కు ముందు భాగంలో పెద్ద తోట ఉంటుంది. అందులో అద్భుతంగా పెంచిన మొక్కలు, ఫౌంటెన్‌లు ఉంటాయి. అతి పెద్దదయిన ఆ తోటలో ఒక పక్కన తాజ్‌మహల్ ఉంటుంది. దీనిని 313 అడుగుల (95 మీటర్లు) వేదికపై నిర్మించారు. ఈ వేదికను ఇసుకరాతితో నిర్మించారు. వేదికకు నాలుగు మూలల్లో తెల్లని పాలరాయితో నిర్మించిన మీనార్‌లు ఉన్నాయి. ఈ కట్టడం అనేక రకాల లతలు, పూలతో నిండి ఉంటుంది. వీటిని రంగురంగుల రాళ్ళతో ఏర్పాటు చేశారు. ఈ వేదికపై 186 అడుగుల (57 మీటర్లు) విస్తీర్ణంలో కట్టడం ఉంటుంది. ఇందులోని పెద్ద గుమ్మటం లోపలి వైపున 80 అడుగుల ఎత్తు, 50 అడుగుల వ్యాసం ఉంటుంది. ఎనిమిది కోణాలతో ఉన్న గదిలో రెండు సమాధులుంటాయి. సమాధుల చుట్టూ పాలరాతితో తయారు చేసిన జాలీలు ఏర్పాటు చేసి ఉంటాయి. అవి షా జహాన్, ఆయన భార్య ముంతాజ్‌వి. తాజ్‌మహల్ ప్లాన్‌ను తయారు చేసినప్పుడు అందులో షా జహాన్ సమాధికి రూపకల్పన జరగలేదు. అందువల్ల అది ఒక్కటే అందులో ఇమడని అంశంగా వాస్తుశిల్పులకు కన్పిస్తుంది. ఈ గుమ్మటం గోడలకు ఎత్తులో ఏర్పాటు చేసిన పాలరాతి వెంటిలేటర్ల ద్వారా పల్చటి కాంతి లోనికి ప్రసరిస్తూ

ఉంటుంది. తాజ్‌మహల్‌కు ఎడమ వైపున ఒక మసీదు ఉంటుంది. దీని నిర్మాణం పర్షియా, మధ్య ఆసియా, ఇస్లామిక్ వాస్తుకళల మేలు కలయికగా ఉంటుంది.

తన భార్య ముంతాజ్ మరణంతో షా జహాన్ కృంగిపోవడంతో రెండు సంవత్సరాల పాటు రాజభవనంలో సంతాపం పాటించారు. అప్పటికి షా జహాన్ తేరుకొని తన ప్రియతమ సతీమణి ముంతాజ్ పట్ల తన ప్రేమకు గుర్తింపుగా ఒక స్మృతి చిహ్నం నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. దీని నిర్మాణంలో 20 వేల మంది కార్మికులు పాలుపంచుకున్నారు. ఈ కార్మికులు తాజ్‌మహల్ సమీపంలోనే ఉండి పనిచేసేందుకు వీలుగా ఒక గ్రామాన్ని కూడా నిర్మించారు. దాని పేరు తాజ్‌గంజ్. తాజ్‌మహల్ నిర్మాణం 1632-1638 మధ్య పూర్తయింది. అయితే మొత్తం కాంప్లెక్స్, తోటలు, ముఖ ద్వారం, మసీదు నిర్మాణం పూర్తవడానికి చాలా కాలం పట్టింది. ఈ తాజ్‌మహల్ రూపశిల్పి ఉస్తాద్ అహ్మద్ లాహోరీ. తాజ్‌మహల్‌ను నిర్మించిన కళాకారులు తిరిగి అంతటి అద్భుత కళాఖండాన్ని మరెక్కడా నిర్మించే వీలు లేకుండా వారి బొటన వేళ్ళను షా జహాన్ నరికించి వేశాడని చెబుతుంటారు. తాజ్‌మహల్ అందాలకు ముగ్ధుడైన ఆంగ్లేయ గవర్నర్ జనరల్ లార్డ్ కర్జన్ దాని గుమ్మటానికి ఒక ఇత్తడి దీపాన్ని వేలాడ దీయించాడు.

చాలా దూరాన యమునా నదికి ఆవలి ఒడ్డున ఉన్న ఆగ్రా కోటనుంచి తాజ్‌మహల్‌ను చూడగలం. కోటలోని తన గదిలో కూర్చొని చూసినా కన్పించే విధంగా షా జహాన్ తాజ్‌మహల్‌ను నిర్మింపజేశాడు. ఆయన తదుపరి రాజ్యాధికారానికి వచ్చిన ఔరంగజేబు తన తండ్రిని గృహ నిర్బంధంలో ఉంచినప్పుడు ఆయన తన గదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయించుకున్న చిన్న, అత్యంత శక్తివంతమైన అద్దంలో ఎల్లవేళలా తాజ్‌మహల్‌ను చూస్తూ ఉండేవాడని అంటుంటారు. ఇప్పటికీ ఆగ్రా కోటలోని ఆ చిన్న అద్దం ద్వారా మనం కూడా వీక్షించగలం. అయితే ఇప్పుడు ఉన్న అద్దం అందరూ తాకుతూ ఉండడం వల్లనయితే నేమి, చాలా కాలం గడిచిపోవడం వల్లనయితే నేమి కొంత మసకబారిపోయి ఉంటుంది. అయినప్పటికీ ఆ మసక అద్దంలోనుంచే పర్యాటకులు తాజ్‌మహల్‌ను వీక్షించి ఆనందిస్తూ ఉంటారు.

మన దేశాన్ని పరిపాలించిన ఆంగ్లేయులు తాజ్‌మహల్‌ను కూలగొట్టి అందులోని అందమైన పాలరాతి పలకలను లండన్‌కు తరలించి వేలం వేయాలని 1830లలో భావించారు. అయితే వారికి ఇంతే విలువైన చలువరాతి పలకలు ఇతర కట్టడాలలో లభించడంతో తమ పథకాన్ని అప్పుడు వాయిదా వేసుకున్నారు.

షా జహాన్ చివరి రోజుల్లో ఆయన కూతురు జహనారా ఆయనను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నది. షా జహాన్ మరణంపై రెండు కథనాలు ఉన్నాయి. ఆయన చాలా అపఖ్యాతికరంగా మరణించినట్లు ఒక కథనం చెబుతుంది. ఔరంగజేబు తన తండ్రిని ఆగ్రా కోటలో నిర్బంధించగా చాలా మౌనంగా ఆ శిక్షను అనుభవించాడని చెబుతోంది.

ఇక రెండవ కథనం ఏమంటే ఆయన వృద్ధాప్యంలో ఆధ్యాత్మికత వైపు మళ్లాడనేది. ఎక్కువ సమయం ఖురాను చదువుతూ గడిపేవాడు. తన చివరి దశలో ఆయన ఔరంగజేబును క్షమిస్తూ ఒక లేఖ రాశాడని, తన సేవకులకు బహుమతులు పంచాడని, నెమ్మదిగా ప్రార్థనలు చేస్తూ

ముంతాజ్ గురించి కొంత...

ఎవరి స్మృతి చిహ్నంగా తాజ్‌మహల్‌ను నిర్మించారో ఆమెను గురించిన లిఖిత సమాచారం చాలా స్వల్పంగా మాత్రమే మనకు లభిస్తుంది. షా జహాన్ నామాలో ఆమెను గురించి ఒక్క వాక్యం మాత్రమే ఉంది. 'బేగం అర్జుమాండ్ రాకుమారునికి ఎల్లవేళలా వెన్నంటి ఉంది'. ముంతాజ్ అసలు పేరు అర్జుమాండ్. ఆమెను గురించిన ఎలాంటి వర్ణనా, ఎలాంటి మాటా అందులో లేదు. తన వివాహం విషయంలో రాకుమారుడు షా జహాన్ తన తండ్రి జహంగీర్ కోపాన్ని చాలా కాలం పాటు చవిచూశాడు. ఆమె ఎల్లవేళలా వెన్నంటి ఉన్నది అంటే దాని అర్థం ఆమె ఎంతో ధైర్యవంతురాలు, సాహసి అని.

ఆమె ఎంతో దయార్ద్ర హృదయురాలు అని కూడా తెలుస్తోంది. ఆమె తన భర్త ప్రేమను ఎంతగా పొంది ఉండకపోతే ఇంతటి గొప్ప కట్టడాన్ని తన స్మృతిచిహ్నంగా కట్టించుకోగలిగి ఉంటుంది? ఆమె 1595లో జన్మించింది.

ఆమె రంగుల చిత్రపటం ఒకటి ఢిల్లీ మ్యూజియంలో ఉంది. అయితే అది ఆమెను నేరుగా చూసి చిత్రకారుడు వేసి ఉండకపోవచ్చునేది అనేక మంది కవులు, పరిశోధకుల అంచనా. ఎందుకంటే ఆరోజుల్లో మొఘల్ రాజ వంశానికి చెందిన మహిళలను చూసేందుకు పరాయి పురుషులకు అనుమతి ఉండేది కాదు. బహుశా చిత్రకారులు ఆనోటా ఈనోటా విన్న విషయాల ఆధారంగా దానిని చిత్రించి ఉంటారనేది మరో అంచనా.

మొఘల్ రాకుమారుడు ఖుర్రమ్ - షా జహాన్ ఆమెను ఎక్కడ కలుసుకున్నదీ చరిత్ర పుస్తకాల ద్వారా మనకు తెలుసు. ఆగ్రా కోటలో ఏటా జరిగే రాయల్ మీనా బజార్‌లో అతడు ఆమెను తొలిసారిగా చూశాడు. ఆ సమయంలో మాత్రమే అంతఃపుర స్త్రీలు పరదాలు లేకుండా కన్పిస్తారట. అలాంటి బజారులోనే అతడు ఆమెను చూసి ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. అప్పుడు అతని వయస్సు 15. ఈ సంఘటన జరిగిన ఐదేళ్ళ అనంతరం 1612లో వారి వివాహం జరిగింది. ఆమె 19 సంవత్సరాలు మాత్రమే కాపురం చేసింది. ఈ పందొమ్మిదేళ్ళ వైవాహిక జీవితంలో 14 మంది బిడ్డలకు జన్మనిచ్చింది. వారిలో ఏడుగురు మాత్రమే బతికారు. ఈ వరుస కాన్పుల మూలంగా ఆమె ఆరోగ్యం దెబ్బతిని అతి పిన్న వయస్సులోనే మరణించింది.



వి.ఐ.పి. బెంచ్

తాజ్‌మహల్‌ను సందర్శించిన వారెవరైనా ఇక్కడ ఫొటో తీయించుకోకుండా బయటకు రారంటే అతిశయోక్తి కాదు. ఎందుకుంటే ఈ బెంచీ మీద కూర్చొని ఫొటో దిగితే మన వెనకే తాజ్‌మహల్ పూర్తి చిత్రం వస్తుంది. అది ఏ పర్యాటకునికైనా ఆనందదాయకమైన విషయమే గదా! ఇక్కడకు వచ్చిన విదేశీ ప్రముఖులు కూడా తమ సతీమణులతో కలిసి తీయించుకొన్న ఫొటోలను మనం పత్రికలలో చూస్తూనే ఉంటాము. అమెరికా అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్, రష్యా అధ్యక్షుడు పుతిన్, పాక్ అధ్యక్షుడు ముషర్రఫ్‌లు తీయించుకొన్న ఫొటోలను మనం పత్రికల్లో చూశాము. అక్కడ ఫొటో దిగడం ఒక థ్రిల్లింగ్. ఇక కొత్తగా పెళ్ళయిన దంపతులు అయితే తమ కల నెరవేరినట్లే భావిస్తారు.

కన్ను మూశాడనేది ఈ కథనం. ఆయన ఏ విధమైన అధికారయుతమైన అంత్యక్రియలు జరగ లేదని, జీవించి ఉన్న ఒకే ఒక్క కుమారుడు ఔరంగజేబు తండ్రి అంతిమ దర్శనం కూడా చేసుకోలేదని చెబుతారు. ఆయనను చందనపు చెక్కలతో తయారు చేసిన శవ పేటికలో తాజ్‌మహల్‌కు తీసుకువెళ్ళి ఆయన భార్య ముంతాజ్ సమాధి పక్కనే ఖననం చేశారు.

నాటి జిలుగులు నేడు లేవు

ప్రేమ జంటలకు, నూతన దంపతులకు ఎంతో ఆనందదాయినిగా ఉన్న తాజ్ నేడు అంతటి ఉత్సాహాన్ని అందించలేక పోతోంది. చికాగోలో పని చేస్తున్న ఆకాష్ మాటల్లోనే పరిస్థితిని తెలుసుకుందాం. 27 ఏళ్ళ ఆకాష్ ఆగ్రాకే చెందిన పరూల్‌ను వివాహమాడాడు. ఆ నూతన జంట తాజ్‌మహల్‌ను సందర్శించాలని నిర్ణయించుకున్నారు. అయితే అక్కడకు వెళ్ళిన కొద్ది నిముషాలకే వాళ్ళకు అక్కడ గుంపులు గుంపులుగా ఉన్న పర్యాటకులు అడ్డంకిగా అన్పించారు. వెంటనే వారు అక్కడి నుంచి వెళ్ళిపోయారు. తాజ్ ప్రస్తుతం మన దేశంలోని అత్యంత పెద్ద టూరిస్టు ఆకర్షణగా ఉండటంతో అక్కడ పర్యాటకుల ఒత్తిడి బాగా పెరిగింది. ఏటా సుమారు 20 లక్షల మంది, ముఖ్యంగా ఎక్కువ విదేశీ పర్యాటకులు తాజ్‌ను సందర్శిస్తున్నారు. ఇక్కడ ప్రవేశ రుసుం భారతీయులకు ఒక రకంగానూ, విదేశీయులకు మరో రకంగా ఉంది. విదేశీయులు తాజ్‌ను సందర్శించాలంటే 750 రూపాయలు చెల్లించాలి. అదే భారతీయులకైతే 20 రూపాయలు మాత్రమే. రుసుం ఇంత ఎక్కువ తేడా ఉండటంతో కొందరు విదేశీ పర్యాటకులు దీనిని సందర్శించకుండానే వెనుదిరుగుతున్నారు. అంతేగాక తాజ్‌మహల్‌కు వెళ్ళే దారిలో అర కిలోమీటరు వరకూ వ్యాపించి ఉన్న దుకాణదారులు కూడా విదేశీయులను విపరీతంగా దోచుకుంటున్నారు.

గతంలో శుక్రవారం నాడు తాజ్‌ను ఉచితంగా సందర్శించే అవకాశముండేది. కానీ ఇప్పుడు అసలు సందర్శననే నిషేధించారు. కేవలం శుక్రవారం ప్రార్థనలకు వచ్చే వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. తాజ్‌ను మిగతా కట్టడాల కంటే ఎక్కువ శ్రద్ధతో కాపాడుతున్నప్పటికీ నానాటికీ దాని వన్నెలు తగ్గుతున్నాయి. అంతే గాక అసలు ప్లాన్‌లో లేని విధంగా అక్కడ బెంచీలను ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల దాని అందాలు కొంత తగ్గే అవకాశముంది. ఆగ్రాలోని కార్ఖానాలలో నుంచి వస్తున్న పొగ వల్ల అది మసకబారి పోతున్నది. నగరంలోని వాహనాల నుంచి విడుదల అవుతున్న పొగ కూడా కొంత వరకు దాని వన్నెలను తగ్గిస్తోంది. కొన్ని కాలుష్య నివారణ చర్యలు చేపడుతున్నప్పటికీ ఇంకా కాలుష్యం పూర్తిగా తొలగి పోలేదు. ★





ఎనిమిది కోణాలతో ఉన్న గదిలో రెండు సమాధులుంటాయి. సమాధుల చుట్టూ పాలరాతితో తయారు చేసిన జాలీలు ఏర్పాటు చేసి ఉంటాయి. అవి షా జహాన్, ఆయన భార్య ముంతాజ్‌వి. తాజ్‌మహల్ ప్లాన్‌ను తయారు చేసినప్పుడు అందులో షా జహాన్ సమాధికి రూప కల్పన జరగలేదు. అందువల్ల అది ఒక్కటే అందులో ఇమడని అంశంగా వాస్తుశిల్పులకు కన్పిస్తుంది. ఈ గుమ్మటం గోడలకు ఎత్తులో ఏర్పాటు చేసిన పాలరాతి వెంటిలేటర్ల ద్వారా పల్చటి కాంతి లోనికి ప్రసరిస్తూ ఉంటుంది. తాజ్‌మహల్‌కు ఎడమ వైపున ఒక మసీదు ఉంటుంది. దీని నిర్మాణం పర్షియా, మధ్య ఆసియా, ఇస్లామిక్ వాస్తుకళల మేలు కలయికగా ఉంటుంది.



తాజ్ కారిడార్ ప్రాజెక్టు

తాజ్ హెరిటేజ్ కారిడార్ ప్రాజెక్టు దేశంలో పెద్ద దుమారం లేపింది. అది ప్రభుత్వ మార్పునకు కూడా కారణమయింది. అసలు ఈ కారిడార్ ఏమిటి? తాజ్‌మహల్ సౌందర్యాన్ని కాపాడేందుకు, దానికి దగ్గరలో ఉన్న మరో నాలుగు కట్టడాలను పరిరక్షించేందుకు చేపట్టిందే ఈ ప్రాజెక్టు. దీనికోసం 175 కోట్ల రూపాయలను కేటాయించారు. ఇందులో కాలి బాటలు, పచ్చిక బయళ్ళ ఏర్పాటుకు కూడా కొన్ని ప్రతి పాదనలున్నాయి. అయితే మాయావతి నేతృత్వంలోని నాటి రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును మార్చి వేసింది. అందులో షాపింగ్స్ మాల్స్, వినోద కేంద్రాల సముదాయ నిర్మాణాలకు అనువుగా దానిని మార్చారు. ఈ మార్పు నదీ ప్రవాహానికి అడ్డుగోడగా మారే ప్రమాదమున్నదంటూ కాలుష్య నివారణ బోర్డు తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. హెరిటేజ్ కారిడార్ ప్రాజెక్టులో చేసిన మార్పులు తాజ్‌మహల్ పరిసరాల్లోని పర్యావరణాన్ని దెబ్బ తీస్తాయని విమర్శలు రావడంతో కేంద్ర ప్రభుత్వానికి, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య జగడం రేగింది. దీనితో మాయావతి ప్రభుత్వమే పడిపోయిన విషయం తెలిసిందే.



350 ఏళ్ళ పండుగకు ఏర్పాట్లు

తాజ్‌మహల్ 350 ఏళ్ళుగా అజరామరంగా వెలిగిపోతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 2004-2005లో పర్యాటకులను పెద్ద ఎత్తున ఆకర్షించాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక శాఖ ఒక ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. నగరానికి జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను పెద్ద ఎత్తున ఆకర్షించేందుకు, వారికి వసతి సౌకర్యాలు, ఇతర సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. తాజ్‌మహల్ బ్యాక్‌డ్రాప్‌లో మెగా సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతోంది. వచ్చే ఫిబ్రవరిలో తాజ్ మహోత్సవ్‌ను నిర్వహించాలని, ఆగ్రా, బ్రజ్ ప్రాంతంలో ప్రారంభ, ముగింపు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసింది.

పిడికిళ్ళెత్తినాం!

మొలకలపల్లి కోటేశ్వరరావు

"నా సంగతి తెలియదు, నోరెత్తిన వాడ్ని నరుకుతా! మామూలుగా కాదు, అద్దం చూపి నరుకుతా! మా పార్టీని తిడితే మాత్రం తెగ్గోయటమే!

"నీ... ఏందిరా నువ్వు లేపేదీ, కూటికుండా?..."

"నాతో నవ్వులాట కాదు. నాతో పెట్టుకోవద్దు. తరువాత అనుకుంటే లాభం లేదు!" "పెద్ద మొనగాడు బయల్దేరాడ్రా... తాగుబోతు నాయాలా అనీ..."



"ఎక్కువ తక్కువ మాట్లాడవాకు. మనాతనా లేదు. ఎవుర్నయనా నరికేస్తా! నాకు ఎదురు మాట్టాడారో పేసు కత్తిని ఏస్తా!" సుబ్బడుతాగి వచ్చి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడు. ఇంటి ఎదురుగా రోడ్డు మీద నిలబడి అరుస్తున్నాడు.

దారిన పోతున్న వెంకన్న నవ్వులాటకి దిగాడు.

"ఒరేయ్... ముదిరిపోయిన సొరకాయల్ని కూడా నరకటం నీ వల్ల కాదురా! లేతలేత సొరకాయల్నీ, బీరకాయల్నీ నరకాల్సిందే!" అంటూ అతను వెళ్ళిపోయాడు.

"చాలుశాల్లేకానీ ఇంక లోపలికి పోయి పడుకో! నువ్వు తాగివచ్చావని అందరూ చూశార్లే..." అంది భార్య ధనమ్మ.

"రెండు రోజుల్నించీ ఈడు తాగి తూల్తున్నాడు. తాగడానికి ఈడికి డబ్బులు ఎక్కడియ్యే?" వరమ్మ అడిగింది కోడలు ధనమ్మని.

"ఏమోనత్తా... నాకేం తెల్సు? ఈయనకి డబ్బులు ఎక్కడ్నించి వస్తయ్యి, ఎవరు ఇయ్యబోయారు? ఎవురో పోయించి వుంటారు?"

"సావాసగాడు ఎవుడో పోయించి వుంటాడు. తోడుబోయినోడు ఎవుడో వుంటాడుగా తాగుబోతోడు!"

"నన్ను తిట్టినా ఒప్పుకుంటా కానీ, నా సావాసగాళ్ళని అన్నారంటే నరికి పోగులు పెడతా! ముక్కలు .ముక్కలుగా నరికి పారేస్తా అవతల, సావాసగాళ్ళంటే పేణం ఇస్తా!"

"కొంపని ఇట్నే నాశినం చేశావు కదరా దయిద్రపోడా! తోటోళ్ళు అందరూ ఎట్ట సంపాయిచ్చు కుంటన్నారూ, ఎట్ట వుంటన్నారూ? ఇట్నే తాగితాగి ఎప్పుడో చస్తావులే? నీలాంటోడు ఉండి మాత్రం ఏం ఉద్ధరించార్లే! వూరాపేరా?" అంది అమ్మ వరమ్మ.

"ఏందే వాగుతున్నావు? నాకు వూరూపేరూ లేదూ? నరుకుతానేయ్, ఏమనుకుంటున్నావో! కన్నతల్లివి అని ఆగా! ఫలానా వరమ్మ కొడుకంటే వూరంతా పేరేనే! నాకు ఇంటో విలువ లేకుండా పోయిందే మీగుండా! వూరు వూరంతా నేనంటే పడి చస్తారే!'

"ఇంటో విలువ వుండమంటే ఏం వుండిద్దిరా ఎదవ గాడిద కొడకా! నాలుగు రూపాయలు సంపాయిచ్చుక వచ్చి పెళ్ళాం బిడ్డల్ని పోషిచ్చురా అప్పుడు యిలువొచ్చిద్ది! ఇంటో ఆడోళ్ళూ, పసి బిడ్డలూ కూలీ నాలీ చేసుకొచ్చి పడేస్తంటే కుక్క తినిపోయినట్టు తినిపోతంటే యిలువొచ్చిద్దంట్రా! మడిసి పుడక పుడితే కాస్త కాకపోతే కాస్తయినా సిగ్గూ శెరమూ వుండాల్రా! పది రూపాయలు కర్చు పెట్టడం కాదురా మొగోడితనమంటే, పది రూపాయలు సంపాయిచ్చుకురాటంరా మొగోడితనం!"

"ఇంకా ఎక్కువా తక్కువా వాగవాకు. నేను కాకుండా ఎవురు సంపాయిచ్చక పెడతంటే బతుకుతున్నారే మీరంతా? అసలు నువ్వు కానీ మయ్య కానీ ఏం సంపాయిచ్చి ఇచ్చారే నాకు? రెక్కలు... నా రెక్కల కష్టం మీదగానీ బతుకుతున్నామే అందరిమీ..."

"నువ్వూరుకో అత్తా, ఆయనతో వాదనెందుకు? మనం ఒక మాట అంటే నాలుగు మాటలు రువ్వుతాడు. ఇయ్యాల కొత్తా? తాగితే మడిసికాదు. ఎందుకు ఆయనతో మాటలు?" అంది ధనమ్మ.

"అసలు ఇంతకీ ఈడికి ఎవురు పోయించారమ్మాయ్ సారాయి? డబ్బులు ఎక్కడ నించి వచ్చినయ్యో చూడు. కాపురం అప్పుల పాలై నిలువునా కుంగిపోతన్నా ఈడికి బుద్ధీగానం రాలా!" అంది వరమ్మ.

"ఒకడు నాకు పోయించేదేందే?నేనే పది మందికి పోయిస్తా! నా దగ్గిర డబ్బులు లేకపోతే కదంటే!"

"నీకు డబ్బులు ఎక్కడ్నించి వచ్చినయ్యి? ఎయ్యి చూపెట్టు" ధనమ్మ అడిగింది అనుమానంగా.

"నీకు చూపెట్టాలా! నువ్వేం మినిస్టరవేంది? ఎందుకు చూపెట్టాలి?"

"నువ్వు చూపెట్టక పోతేనేం కానీ, నీకు డబ్బులు ఎక్కడియ్యో చెప్పు?"

"నీకు ఎందుకు చెప్పాలి? చెప్పను"

భర్తతో ఇక వాదన అనవసరం అని ధనమ్మ మాట్లాడలేదు. డబ్బులు ఎక్కడనించి వచ్చాయో అంతుపట్టడం లేదు. మనసులో అనుమానం బలపడి గాభరా, ఆందోళన, భయం కలుగుతోంది.

* * *

ధనమ్మకి స్వయానా మేనత్త కొడుకు సుబ్బయ్య.

ఎకరం పొలం వుంది. అమ్మా నాయనలకి ఒక్కడే కొడుకు. అతి గారాబంగా పెంచారు.

సుబ్బయ్యకి 19 ఏళ్ళ వయసు. ధనమ్మకి

15 ఏళ్ళ వయసులో పెళ్ళయ్యింది.

కష్టజీవి సుబ్బయ్య. పొలం పని చేస్తూనే ట్రాక్టర్ నడపడం నేర్చుకున్నాడు. తరువాత ట్రాక్టర్ డ్రైవర్‌గా కుదిరాడు. టౌనుకి ట్రాక్టర్ మీద ఇసుక, కంకర బాడుగలు తోల్తూ తాగుడు నేర్చుకున్నాడు.

"తాగుడు మనకి మంచిది కాదయ్యా! ఎందుకా ఎదవ అలవాటు?" అని మొదట్లనే చెప్పింది ధనమ్మ.

"ఏమైంది లేవే? మనం ఏమైనా డబ్బులు పెట్టి తాగుతున్నామా? వూరక వచ్చిందేగా!"

"ఇయ్యాల వూరక వచ్చిందని తాగుతావు రేపు అదే అలవాటయిద్ది. ఎందుకా అలవాటు, అసలు తాక్కపోతే ఏ గొడవా వుండదు కదా!"

"నేను ఎందుకు చేసుకుంటానే అలవాటు?"

"నువ్వు చేసుకోవు, అదే చేసుకునిద్ది నిన్ను అలవాటు. ముందు అది మనకి లొంగి వుండిద్ది. ఉండే కొద్దీ అదే మనల్ని లొంగతీసుకునిద్ది. దానికి ఇంక బానిసలైపోతారు!"

"ఏమేయ్.. నన్ను తేలిగ్గా అంచనా వేశావ్! నాది ఉక్కు మనసు. ఉక్కు పిండమే ఇది. అంత తేలిగ్గా లొంగుతాననుకుంటున్నావేమిటి?"

"కన్నుపోయేటంత కాటుక ఎందుకు ? ఏదైనా మరక్కూడదు. మరిగామో మానుకోవడం అంత తేలికకాదు. మనకి అలాంటి అలవాట్లు వద్దయ్యా!" అని చెప్పింది ధనమ్మ.

మొదట్లో పండగలకీ పబ్బాలకీ, ఎవరైనా స్నేహితులు పార్టీలు ఇప్పిస్తేనో తాగేవాడు. స్వంత డబ్బులు పెట్టి మాత్రం తాగేవాడు కాదు.

"ఒరేయ్... ఎప్పుడూ మా దగ్గిర డబ్బుతో మందు తాగడమేనా? నువ్వు ఇప్పించే పని లేదేమిటి? అదేం సావాసంరా? సావాసానికి పేణం ఇస్తానంటావు! నువ్వు ఈసారి ఇప్పించాలిరా!" అని నాలుగు సార్లు పార్టీలు ఇప్పించిన స్నేహితులు ఐదోసారి గొడవ చేశారు.

ఇక తప్పదనుకుని సుబ్బయ్య మిత్రులకి పార్టీ ఏర్పాటు చేశాడు. పార్టీ అంటే తినడం, తాగడం! అదే పార్టీ!

కొన్నిసార్లు స్నేహితులు తాపించడం, తరువాత తను తాపించడం, స్నేహితులు లేని రోజుల్లో స్వంత డబ్బులతో తాగడం మొదలు పెట్టాడు సుబ్బయ్య.

తాగుదామా, మానుకుందామా, నెమ్మదిగా అలవాటై పోతున్నదే అని రెండు రోజులకో, మూడు రోజులకో తాగుతూ మధనపడుతూ వూగిసలాడుతున్న దశలో ఎన్నికలు వచ్చి పడ్డాయి.

ఊరంతా హోరాహోరీ పోటీ! రెండు వర్గాలూ బలమైనవే!

ఎవరికి వాళ్ళే చిత్తు కాగితాలు పంచినట్లు డబ్బు కాగితాలు పంచారు.

తాగుడు విషయం చెప్పే పని లేదు. మందు మురుగు కాల్వలై పారింది.

తాగిన వాడికి తాగినంత! తాగనివాడిదే తప్పు!

ఉచితంగా వస్తోంది, ఎందుకు పోవాలి?

ఆ 20, 25 రోజులూ సుబ్బయ్య పూర్తిగా తాగడంలో మునిగి తేలాడు. అప్పట్నించీ క్రమంగా అలవాటై పోయింది. తాగుతూ సరిగా డ్యూటీ చేయకపోవడంతో ట్రాక్టర్ యజమాని సుబ్బయ్యని సాగనంపి మరో కుర్రాడ్ని డ్రైవర్‌గా తీసుకున్నాడు.

పనికూడా లేకపోవడంతో సుబ్బయ్య తాగుడే పనిగా పెట్టుకున్నాడు. అప్పులు కూడా చేసి తాగడం ప్రారంభించాడు.

ముగ్గురు పిల్లలు కలిగారు.

ఖర్చులు పెరిగాయి. తాగుడూ పెరిగింది, అప్పులూ పెరిగాయి.

చివరికి ఆ అప్పులు తీర్చడం కోసం ఎకరం పొలం అమ్మకానికి పోయింది.

పొలం కూడా లేకుండా ఆధారం... రెక్కలు!

కూలికి పోతేనే కుండమాట్టం లేకుంటే కడుపు మాట్టం!

ఇలాంటి స్థితిలో తొమ్మిదేళ్ళ నాడు మద్యనిషేధం అమలులోకి వచ్చింది.

నిషేధం అమలులో వున్న రెండేళ్ళూ ఇంట్లో అందరికీ ఐదువేళ్ళూ నోట్లోకి పోయాయి. చాలా వరకూ ఆకలి అనే మాట ఇంట్లో వినపడలేదు.

తాగాలని మనసు పీకుతున్నా తేలికగా దొరికేది కాదు. దొంగతనంగా అమ్మేవాడు ఎవడో, దొంగతనంగా వెళ్ళి తాగి రావాలి! ఎక్కువ రేటు పెట్టాలి.

చాలా వరకూ అమ్మేవాళ్లు లేకుండా పోయారు. తాగేవాళ్ళు తగ్గిపోయారు.

ఆ రెండేళ్ళలో యుక్త వయసుకి వచ్చి నేర్చుకునే వాళ్ళ సంఖ్య బాగా తగ్గిపోయింది.

నేరాలు తగ్గాయి. అరాచకాలు తగ్గాయి. ఘోరాలు కనుమరుగయ్యాయి. తాగి సృష్టించే తగాదాలు లేకుండా పోయాయి.

నిషేధం లేక ముందు కూలికి వెళ్ళి, కూలి డబ్బులు తీసుకుని, అట్నించి అటే సారా అంగడికి పోయి రోజంతా శ్రమ చేసి సంపాయించిన సొమ్ము ఆ అంగడిలో సమర్పించుకుని, తాగి తూలుతూ, అక్కడ్నించే తిట్ల పురాణం చదువుతూ ఇంటికి వచ్చే సుబ్బయ్య కూలి డబ్బులు నిషేధం పుణ్యమా అని ఇంట్లోకి వస్తున్నాయి.

పిల్లలు సంతోషంగా వున్నారు. ధనమ్మ, వరమ్మ కూడా కొడుకు మారినందుకు, సారాయి లేకపోయినందుకూ సంతోషించారు.

తాగుబోతుల కుటుంబాలు ఆనందంగా కళకళలాడిపోతున్న సమయంలో దశలవారీగా నిషేధం తొలగింది. మెల్లమెల్లగా సన్నటి పిల్లకాలువలా ప్రవేశించిన మద్యం మహాప్రవాహంలా, ప్రళయ ప్రభంజనంలా వూరూ వాడా ముంచెత్తింది.

పచ్చటి కాపురాల్లో తిరిగి చిచ్చురేపింది. మళ్ళీ మహిళల ఉసురుపోసుకుంది.

తిరిగి మగవాళ్ళు మహోత్సవంతో తాగుడుకు బందీలయ్యారు.

సుబ్బయ్య కూడా మొదలెట్టాడు. మొదట్లో పనికి వెళ్లి ఆ డబ్బుతోనే తాగేవాడు. తరువాత పనికిపోవడం కూడా మానుకున్నాడు.

తాగుడుకు డబ్బు కావాలి కదా! భార్యని వేధించడం మొదలు పెట్టాడు.

ఎప్పుడైతే పని చేయకుండా, తాగుడుకు బానిసై అప్పులు చేస్తూ, తగాదాలు తెస్తూ పనికి మాలిన వాడిగా గుర్తింపు పొందాడో, అప్పుడే సుబ్బయ్య కాస్తా సుబ్బడిగా మారిపోయాడు. జనం అతనికి కనీస విలువ కూడా ఇవ్వడం మానేశారు. ఒకరోజు భార్యని డబ్బు అడిగాడు.

"ధనాం... ధనాం... ఒక్క ఇరవై రూపాయలియ్యవే! చీవన్నా వేసుకుంటానే! మందులేకపోతే నా వూపిరి పోయిద్దే! నా నరాలు గుంజుతున్నయ్యే! ఒక్క ఇరవై ఇయ్యవే!"

"ఇరవై పైసలున్నయ్యా? పని చేసే యాడులో వుండోడివి పనికి పోకూడదూ? ఇంటో ఆడోళ్ళు చేసుకొచ్చి పెడతంటే తింటా? నా దగ్గిర డబ్బులు ఎక్కడున్నయ్యి?"

"రేపటినుంచీ పనికి పోతానే! ఇయ్యాల్టికి ఇయ్యవే! మందులేకపోతే నాకు పేణం పోయిద్దే! చచ్చిపోతానే!"

"చస్తే చచ్చావులే. పీడాపోయిద్ది! నీకు డబ్బు నేనెక్కడ తెచ్చిచ్చేది?"

"అంతేలే. నువ్వు నాకు ఎందుకు ఇస్తావు డబ్బు? నేను నీకు పీడగా వుంటిని! నేను చస్తే కానీ అప్పుడు పై మొగుడితో ఇంకా బాగా కులకొచ్చు!"

"ఆ మాటలే వద్దనేది! నీ నోరు పడిపోనూ! నీ తాగుడుకు డబ్బులు ఇస్తే ఇచ్చినట్టూ లేకపోతే రంకుతనం అంటకడతా ? పురుగులు పడి చస్తావు, ఉత్తపుణ్ణానికి తిడతన్నావు కాబట్టి!"

"ఏందే, నేను పురుగులు పడి చస్తానూ, నా నోరు పడిపోవాలీ!" అని ధనమ్మని వంగతీసి, వీపుమీద దభీదభీమని కొట్టాడు.

మొదట్లో కొన్నిసార్లు డబ్బులు ఇచ్చినా, తరువాత దెబ్బలు తినడానికైనా సిద్ధమైంది కానీ డబ్బులు ఇవ్వడం పూర్తిగా మానుకుంది.

కుటుంబం జరక్కపోవడంతో బడికి వెళ్తూ మూడు, నాలుగు తరగతులు చదువుతున్న పెద్ద పిల్లలు ఇద్దర్నీ చదువు మాన్పించి తనతోపాటు కూలికి తీసుకుపోయింది.

ధనమ్మ కూలి డబ్బులు ఇంట్లో దాచి వుంచితే, ఆ డబ్బు తీసుకుపోయి సారా దుకాణానికి సమర్పిస్తున్నాడు.

భర్త కంట పడకుండా ఎక్కడో దాచి వుంచేది ఆమె.

అయినా సరే, అందరూ పనికి పోయిన సమయంలో ఇంట్లో అణువణువూ శోధించి దాచిన డబ్బు సాధించి తీసుకుపోయేవాడు.

బుట్టల్లోనూ, తట్టల్లోనూ, పాత బట్టల్లోనూ, గిన్నెల్లోనూ, చెంబుల్లోనూ, తపేళాల్లోనూ చివరికి బియ్యంలోనూ - ఎన్ని చోట్ల ఎంత రహస్యంగా దాచి వుంచినా అన్ని చోట్లా గాలించే వాడు.

ఇక ఇంట్లో పెట్టకుండా చెంగులో డబ్బు గట్టిగా మూటకట్టుకుని, చీర కుచ్చెళ్ళలో దోపుకునేది.

పోయిన ఎండాకాలంలో పిల్లలు పస్తు పడుకున్నారు. పనులు లేని కాలం, తిండికి చాలా ఇబ్బంది పడ్డారు. పిల్లలు 'అన్నమో-రామచంద్రా!' అని విలపించారు.

కూలిలేదు. పని లేదు. సాపాటు లేదు.

చౌకడిపో షావుకారును బతిమాలి, భంగపడి, కాళ్ళూ, వేళ్ళూ పట్టుకుని 20 కేజీల బియ్యం అప్పు తీసుకొచ్చి కొంతకాలం రోజుకోపూట చొప్పున వండితే, అర్ధాకలితో బతికారు.

ఇంతలో వానలు పడి పనులు దొరికాయి.

ధనమ్మ, అత్త వరమ్మ, పిల్లలు ఇద్దరూ ప్రతిరోజూ పనికి పోతున్నారు. నలుగురి మీదా వందరూపాయలు వస్తున్నాయి. 70, 80 రూపాయలు కుటుంబ ఖర్చులు పోయినా రోజుకో 20 లెక్కన మిగిల్చింది ధనమ్మ.

ఈ ఏడాది ఎండాకాలంలో పస్తులు పడుకోకుండా ఒంటిపూట అయినా తిండి తినాలనే ఉద్దేశంతో డబ్బు కదిలించకుండా దాచింది.

ఎంతో జాగ్రత్తగా చీర చెంగున కట్టుకుని దాచిన డబ్బు 12 వందలు అయింది. ఒక రోజు చేలో పత్తి తీస్తుండగా, పొరపాటుగా డబ్బు మొత్తం చీర

ముడివిడిపోయి జారిపోయింది. డబ్బుపోయిన చాలా సేపటికి చూసుకుంది ధనమ్మ.

గుండెలు బాదుకుంది. వెంటనే వెదుకులాడింది. డబ్బులు పొలంలో పడిన చోటే దొరికాయి.

"పసిబిడ్డల కష్టార్జితం. అంత తేలికగా పోవు!" అని సంతోషపడుతూ డబ్బు తిరిగి మూటకట్టుకుంది.

అయితే అలా డబ్బు చీరచెంగున కట్టుకోవడం ప్రమాదం అని భావించింది. ఎప్పుడైనా పోవచ్చు.

ఇంతలో సంక్రాంతి పండుగ వచ్చింది.

పండుగ కోసం ఇల్లు అలుకుతూ, ఒక మూలలో వున్న చెక్కపెట్టె పక్కకి జరిపి, దాని కింద గుంట తవ్వి, డబ్బుని మూటకట్టి ఆ గుంటలో పూడ్చి, అక్కడ తిరిగి అలికి, అక్కడ వుండే చెక్కపెట్టెని యధావిధిగా అదే స్థానంలో వుంచింది.

తను డబ్బు దాచిన ప్రదేశం భర్త కంట కాదు గదా, బ్రహ్మదేవుడి కంట కూడా పడదని భావించింది ఆమె.

చెక్కపెట్టె కొంచెం కదిల్చినట్టు పసిగట్టి, డబ్బు దాచిన చోటు కనిపెట్టాడు. గుంటలో డబ్బు తీశాడు. చెక్క పెట్టెని యథాస్థానంలో వుంచాడు.

ఇక రెండు రోజుల నించీ ఎత్తిన సీసా దించడంలేదు.

* * *

ధనమ్మ మనసు కీడు శంకించడంతో లోపలికి వెళ్ళి, చెక్కపెట్టెని దూరం జరిపి చూసింది.

చిన్నగుంట ఖాళీగా దర్శనమిచ్చింది.

"ఓయమ్మో... ఓర్నాయనో... వీడి దినం జెయ్యా! డబ్బు నూకేశాడ్రో దేవుడో!" అంటూ కోపంతోనూ, దుఃఖంతోనూ పెద్దగా తిట్లకు లేచింది.

"ఏందే ఏందే?" అంటూ వచ్చింది వరమ్మ.

"నీ కొడుకు కాజేశాడత్తా! డబ్బు కాజేశాడు. ఎండాకాలంలో నూకల కూడన్నా పెడదామని డబ్బు దాస్తే, కాజేసి తీసకపోయి తగలేశాడత్తా!" అంటూ ఏడుపుకు లేచింది.

"ఏంతేంది?"

"పన్నెండు వందలు అత్తా! మనం తినీ తినకా పైసా పైసా ముడేసిన సొమ్ము సారాయోడి ఎదాన ధారపోసి వచ్చాడత్తా! పసిబిడ్డలు కష్టం చేసిన సొమ్ము" అంటూ లబలబలాడింది.

పన్నెండేళ్ళ పెద్దపిల్లవాడు బజారు నించివస్తే, వాడికి ఏడుస్తూ విషయం చెప్పింది.

అందరూ కలిసి సుబ్బడ్ని పట్టుకుని చొక్కా జేబుల్లో వెదుకులాడితే 170 రూపాయలు దొరికాయి.

ఆ రెండు రోజులకే తాగుడికి 1030 రూపాయలు ఖర్చు పెట్టాడు.

ధనమ్మ బాధపడుతూ ఏడుస్తూ తిడుతూ వుంటే, సుబ్బడూ తగ్గకుండా అంతకు రెండు రెట్లు మొత్తంలో తిడుతూనే వున్నాడు.

వీళ్ళగోల ఇలా వుండగా–

మూడు ఇళ్ళ అవతల వున్న రంగన్న బాగా తాగివచ్చి భార్యని గొడ్డను కొట్టినట్లు చావగొడుతున్నాడు. నీచాతినీచమైన తిట్లు తిడుతున్నాడు.

రంగన్న మనిషి మంచివాడే! తాగితే మాత్రం మనిషి కాదు. తాగిన రోజు భార్యకి నరకాన్ని చూపెడతాడు.

సుబ్బడు గడగడా అప్పచెప్పినట్లే భార్యని తిడుతున్నాడు.

ధనమ్మ భర్తని తిట్టడం ఆపింది.

ఆలోచించసాగింది ఆమె.

తిట్టుకుని ఉపయోగం లేదు.

ఇది ఒకపూట సమస్య కాదు. ఒక రోజు సమస్య కాదు. నిత్యం ఈ గొడవ! నిరంతరం!

ఎన్నాళ్ళీ రభస?

తన భర్త ఒక్కడే కాదు, ఊళ్లో సగం మంది ఇవ్వాళ తాగుతున్నారు. అది అలవాటైంది. ఫ్యాషనైంది.

మగవాళ్ళు కొంతమంది బిడ్డలకి తిండి లేకుండా పస్తులు అయినా పడుకోబెడుతున్నారు కానీ తాగకుండా వుండలేకపోతున్నారు.

పది రోజుల క్రితం వూళ్ళో ఒకడు తాగి, అనుమానంతో భార్యని విపరీతంగా కొడుతుంటే



ఆయువుపట్టుకు తగిలి ఆమె ప్రాణాలు పోయాయి.

ఇదే కాదు, ఇంకా చాలా అరాచకాలు జరిగిపోతున్నాయి.

మూడు వందల గడపవున్న వూళ్ళో 60 షాపులు వెలిశాయి. బెల్ట్ షాపులు ! తేలికగా వచ్చే ఆదాయం ఇదేగా కనపడుతోంది చాలా మందికి!

బీడీల బంకుల్లోనూ, బజ్జీల అంగళ్ళలోనూ, కూరగాయల దుకాణాల్లోనూ, కొబ్బరి బోండాలు అమ్ముకునే వాళ్ళు, చిల్లరకొట్ల వాళ్ళు, చిత్తు కాగితాలు కొనుక్కునే వాళ్ళు – ఒకరేమిటి, ప్రతి వ్యాపారీ ఇవ్వాళ సీసాలు అమ్ముతున్నాడు.

మండల కేంద్రం నించి ప్రతిరోజూ ఠంచన్‌గా తెల్లవారకముందే జీపు వచ్చి, బెల్ట్ షాపుల వాళ్ళకి సరుకువేసి పోతుంది.

ఊళ్ళో తాగడానికి నీళ్ళు లేవు. మైలుదూరం మంచి నీళ్ళు తెచ్చుకోవాలి. వాడుక నీళ్ళకి బోర్‌పంపుల చెంత గంటలు గంటలు పడిగాపులు కాయాలి.

ప్రతి ఒక్కరికీ అవసరమైన నీళ్ళు లేవు కానీ, అనవసరమైన మందు మాత్రం పుష్కలంగా దొరుకుతోంది!

కొత్త కొత్త వాళ్ళు కూడా తాగుడు నేర్చుకుంటున్నారు.

తమ చాకిరీ, తమ శ్రమా, తమ సంపదా, తమ రెక్కల కష్టం అంతా తాగుడికే హరించుకుపోతోంది.

ఎవరో కొద్దిమంది స్వలాభం కోసం, స్వార్థం కోసం లక్షలాది మంది బలైపోతున్నారు. తాగీతాగీ ఆరోగ్యం పాడై చచ్చిపోతున్న వాళ్ళు ఎందరో!

డ్వాక్రా గ్రూపులకి అర్థరూపాయి వడ్డీలకి అప్పులు ఇస్తామంటున్నారు. ఎందుకా డబ్బు? ఎడం చేత్తో పావలా ఇస్తూ కుడిచేత్తో పాతిక రూపాయలు గుంజుకోవడానికా?

ఈ మందును బందు చేయాలి.

కొంగు బిగించింది ధనమ్మ. అప్పటికప్పుడే చెప్పులు వేసుకుని బయల్దేరింది.

తాగుడు వలన చితికిపోతున్న కాపురాల్లోని స్త్రీలని కలిసింది. వాళ్ళని కదిలించింది.

అందరూ కష్టం సుఖం చెప్పుకున్నారు. బాధల గాథలు పంచుకున్నారు.

ప్రభుత్వం, ప్రముఖుల అండదండలు మందుకి దండిగా వున్నాయనీ, దానిని రూపుమాపడం అంత తేలికైన విషయం కాదనీ, అడ్డంకులు ఎదురైనా దృఢంగా నిలబడాలనీ, ఆడవాళ్ళు తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చనీ – వాళ్ళకి వాళ్ళే ధైర్యం చెప్పుకున్నారు.

ఒక చిన్న ఉద్యమ కార్యక్రమాన్ని రూపొందించుకున్నారు.

మరుసటి రోజు వూళ్లో వూరేగింపు తీశారు.

'మందు వద్దు – మంచినీళ్ళు కావాలి!'

'కాపురాలు కూల్చే సారా వద్దు – అది లేకుంటేనే ముద్దు'

అంటూ రకరకాల నినాదాలు ఇచ్చారు.

ఊరేగింపు అయిన తరువాత రెండు ట్రాక్టర్లు పెట్టుకుని, ఆడవాళ్లు మండలం ఆఫీసుకి వెళ్ళి ఎం.ఆర్.ఓ.కి వినతిపత్రం ఇచ్చారు.

ప్రభుత్వం దృష్టిలో కూడా నేరమైన, చట్ట వ్యతిరేకమైన బెల్టు షాపుల్ని ఎత్తివేయాలనీ, అవి తీయించకుంటే తరువాత జరిగే పరిణామాలకి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వుంటుందనీ, తమకి సంబంధం వుండదనీ హెచ్చరించి వచ్చారు.

మండల కేంద్రం నించి వచ్చే సారా జీపును వూళ్ళోకి రానివ్వకుండా అడ్డుకోవాలని నిర్ణయించుకున్నారు.

మరుసటి రోజు.

ఎప్పటిలా వేకువనే వస్తున్న సారా జీపుకి అడ్డుగా మహిళలు పడుకున్నారు.

జీపులో వున్న సారా వాళ్ళకీ, మహిళలకీ చాలాసేపు వాదన, ఘర్షణ జరిగింది.

"మా ఊళ్ళోకి మీ సారా జీపు రావడానికి వీల్లేదు. మర్యాదగా వెనక్కి వెళ్తారా సరే, లేకుంటే సారాతో మిమ్మల్ని తగలబెడతాం!" అన్నారు మహిళలు ముక్తకంఠంతో.

చివరికి చేసేది లేక జీపుని వెనక్కి తిప్పి తీసుకుపోయారు.

అప్పుడే సూర్యోదయమవుతూ వెలుగురేఖలు నెమ్మదిగా లోకమంతటా పరుచుకుంటున్నాయి.

★

బహుమతి

అమ్మిన శ్రీనివాసరాజు

గోదావరి తీరంలో పెద్ద మర్రిమాను వుంది. అక్కడికి సమీపాన వున్న డొంకల్లో దుష్టమూర్తి అనే తోడేలు నివసిస్తుండేది. పేరుకు తగ్గట్టుగానే దానికి దుష్టబుద్ధి వుంది. ఎప్పుడూ ఎవరిని మోసం చేద్దామా? ఎవరిని మాయమాటలతో బుట్టలోవేసి తిందామా? అని ఆలోచిస్తుండేది. తేరగా దొరికే కోళ్లు, బక్కచిక్కిన మేకలు, పెద్ద జంతువుల కళేబరాలు తింటూ కాలం వెళ్లదీస్తుండేది.

ఓ రోజు మధ్యాహ్నపువేళ దానికొక బక్క చిక్కిన మేక పిల్ల దొరికింది. దక్కిందే చాలనుకుని లొట్టలు వేసుకుంటూ, ఆవురావురుమంటూ దాన్ని చంపి తినసాగింది. అలా రెండు, మూడు మాంసం ముక్కలు తిందో లేదో గొంతులో కలుక్కుమంది. దాని గొంతులో బుల్లి ఎముక ఇరుక్కుపోయింది. దాంతో తోడేలు ఆనందం కాస్తా ఆవిరైపోయింది. కక్క లేక మింగలేక కళ్లు తేలేసినంత పనైంది దుష్టమూర్తికి.

పరిస్థితి ప్రాణాంతకంగా వుంది. మాంసం తినడానికి వీల్లేదు. నీళ్లు తాగడానికి గొంతురాదు. అటువంటి సమయంలోనూ దానికో చక్కటి ఆలోచన వచ్చింది. వెంటనే దగ్గర్లో వున్న నీళ్ల మడుగువైపు పరిగెత్తింది. దానికి అక్కడ ముత్యరాణి అనే కొంగ కనిపించింది. దుష్టమూర్తి ముక్కుతూ మూల్గుతూ కొంగ దగ్గరకు వెళ్లింది. తన గొంతు బాధనంతా కొంగ ముందు వెళ్లగక్కింది.

"అయ్యో...! తోడేలు మావా! నీకు అంత ఆపదొచ్చిందా?! నీ బాధ తీర్చడానికి నేనున్నా చూడు..." అంటూ దుష్టమూర్తి గొంతులోని ఎముక ముక్కను తన పొడవైన కోరముక్కుతో ఒడుపుగా లాగి తీసేసింది. గొంతు బాధ తీరడంతో దుష్టమూర్తి మొహం ఆనందంతో మొగలిపువ్వులా విచ్చుకుంది. సంతోషంతో గెంతులు వేసింది. పాటలు పాడింది.

"తోడేలు మావా?! తోడేలు మావా! నీ గొంతు బాధ తీర్చిన నాకు మంచి బహుమతి ఇవ్వవూ?" అని అడిగింది పొడవాటి మెడను వయ్యారంగా తిప్పుతూ కొంగ.

"ఓసి నా చిట్టి కొంగా... అంతకంటేనా. అయినా నీకు ఆ బహుమతిని అప్పుడే ఇచ్చేశానుగా" అనేసింది తోడేలు కళ్లు తిప్పుతూ.

ఆ మాటలతో పాపం మొదట కొంగ నోట మాట రాలేదు. కానీ తర్వాత సర్దుకుని "అదేంటి మావా!? నాకు తెలియకుండా బహుమతి ఏమిచ్చావు?" అంది మిటకరిస్తున్న చూపులతో. "ఆఁ.. ఇందాక నువ్వు నా నోట్లో ముక్కు పెట్టావు గుర్తుందా?" అంది తోడేలు.

"ఔను. నీ గొంతు బాధ తీర్చడానికే కదా?!" అంది అమాయకంగా కొంగ.

"అదుగో అప్పుడే నీ మెడ కొరక్కుండా వదలడమే నేను నీకిచ్చిన పెద్ద బహుమతి" అంది తోడేలు తెరలు తెరలుగా నవ్వుతూ.

"అమ్మో! అందుకనే... దుష్టులకు సాయం చెయ్యకూడదంటారు పెద్దోళ్లు. నీకో నమస్కారం. నీ బహుమతికో నమస్కారం" అంటూ సయ్యిన లేచి మర్రిమాను కొమ్మల్లో దూరింది కొంగ.



ఏముందీ చిత్రంలో!



హాయ్ నేస్తాలూ...! పక్కన ఓ బొమ్మ వుంది కదా. అందులో మీకు ఏం కనిపిస్తోంది? తొందరేం లేదులే. కాస్త ప్రశాంతంగా చూసి చెప్పండి. ఎందుకంటే ఎప్పుడూ మీరే పప్పులో సారీ తప్పులో కాలేస్తున్నారు. అందుకని ఈసారి అలా కాకూడదనే ఇదంతా చెప్తున్నాం. 'ఆ ఇందులో ఆలోచించడానికేం వుందండి. అదేదో చిన్న పాత్రలాగా వుంది. అంతేకదా. ఈసారి తప్పులో కాలేసే ఛాన్సే లేదు' అంటున్నారు కొందరు చిన్నారులు. కానీ సారీరా. మీరు మళ్లీ పొరపాటుగా చెప్పారు. మీరు పరిశీలనా దృష్టిని మరింత పెంచుకోవాలి. ఈ బొమ్మలో మీరు చెప్పిన పాత్రతోపాటు మరో రెండు బొమ్మలున్నాయి. ఆ పాత్రకు రెండు వైపులా రెండు తలలు వున్నాయి. ముక్కు, కళ్లు, నోరు, గడ్డం... అంతా స్పష్టంగా కనిపిస్తోందా? ఆ... ఇప్పుడు ఒప్పుకుంటారా? మీరు సరిగ్గా చూడలేదని.

మేజిక్! మేజిక్!!

చిన్నారి చిత్రకారులు



వలి,
5వ తరగతి,
రాహుల్ పబ్లిక్‌స్కూల్,
చీరాల, ప్రకాశం.

గంగారపు హరీష్,
4వ తరగతి,
డగ్లస్ స్కూల్,
శ్రీకాకుళం.

కె.అనిత, 9వ తరగతి,
మధు విద్యాలయం,
వైరా.



బి.భరత్‌కుమార్, 6వ తరగతి,
ఎంపియుపి స్కూల్,
గండిగుంట, కృష్ణా.

చెరుకు తింటోంది ఎవరబ్బా!



చిన్నారులూ... నేను. చెరుకుగడలు నములుతున్నాను. ఇంకా నన్ను గుర్తు పట్టలేదా! అర్రే నాకు అవంటే చాలా ఇష్టం. నాకు పెద్ద పెద్ద దంతాలు కూడా వుంటాయి. భూమి మీద నివసించే జంతువులలో అతి పెద్దదాన్ని. ఇంకా తెలీలేదా? అయితే చుక్కలు కలిపి చూడండి.

క్విజ్-100

1. రాజమండ్రి ఏ నది ఒడ్డున వుంది?
   ఎ. కృష్ణా బి. గోదావరి
2. మన జాతీయ పక్షి ఏది?
   ఎ. పావురం బి. నెమలి
3. భూమి ఏ ఆకారంలో వుంది?
   ఎ. బంతి బి. బల్లపరుపు
4. మన దేశంలోకెల్లా అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ ఏది?
   ఎ. రైల్వే సంస్థ బి. బ్యాంకింగ్ సంస్థ
5. గాంధారకళ ఎవరి కాలంనాటిది?
   ఎ. కనిష్కుడు బి. అక్బర్
6. అతి తెలివైన జంతువు ?
   ఎ. మానవుడు బి. డాల్ఫిన్
7. ఆహారాన్ని నిల్వ చేసే వేళ్లు?
   ఎ. క్యారెట్, చిలగడదుంప బి. మర్రి
8. చెరకును ఎలా ఉత్పత్తి చేస్తారు?
   ఎ. గడలను (ముచ్చెలను) పాతడం
   బి. ఆకులను పాతడం
9. దేహంలోని ఏ భాగంలో ఎర్ర రక్తకణాలు ఉత్పత్తి అవుతాయి?
   ఎ. కాలేయంలో బి. ఎముక మజ్జ
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ. ప్రకాష్‌కరత్
   బి. సీతారాం ఏచూరి

క్విజ్99కు జవాబులు

1. కరిగిన లావా 2. కాలిఫోర్నియా 3. కివి 4. హిమాచల్ ప్రదేశ్ 5. 1872 6. ప్రాచీన శిలాయుగం 7. కారల్‌మార్క్స్ 8. లార్డ్ ఆఫ్ ది రింగ్స్ 9. అధిక పాల ఉత్పత్తి 10. పీటర్ జాక్సన్

క్విజ్ 98కి సరైన సమాధానాలు రాసిన వారు :

టి.అలేఖ, 7వ తరగతి, ఐతానగర్, తెనాలి. **ఎం.మోహన్‌కుమార్**, 7వ తరగతి, జడ్‌పిహెచ్‌ఎస్, ఖమ్మం. **ఎస్.సురమ్య**, 8వ తరగతి, పాత పొన్నూరు. **డి.విజయదుర్గ**, 6వ తరగతి, విజయనగరం. **పి.పార్వతి**, **9వ** తరగతి, లక్ష్మీనగర్. **బి.విజయసుందర్**, 6వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **ఎం.తిరుపతయ్య**, 10వ తరగతి, విద్యానగర్, హైదరాబాదు.

కలం స్నేహం

పేరు: బి.సాయిసుధ,
వయసు : 13 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : చెస్ ఆడడం, నాట్యం చేయడం.
పూర్తి చిరునామా: బి.సాయిసుధ, డాటరాఫ్ బి.సత్యనారాయణ, ఇ.నెం: **1-1.** తోటవల్లి, భద్రాచలం, ఖమ్మం-**507 134.**

పేరు: యం.రవివర్మ,
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : కవితలు రాయడం, క్రికెట్ ఆడడం, బొమ్మలు వేయడం, కలం స్నేహం చేయడం.
పూర్తి చిరునామా : యం.రవివర్మ, సన్నాఫ్ బాబురావు, ఇం.నెం: **9-20,** ఇంద్రకాలనీ, నుర్పల్లి, రంగారెడ్డి-**501203.**

మిత్రభేదం

పంచతంత్ర కథలు

రాకుమారుల్లో ఒకరు లేచి 'గురువర్యా! ఇప్పటి వరకు మాకు మిత్రలాభం గురించి కథలు చెప్పారు. మిత్రభేదం గురించి కూడా చెప్పండి' అన్నాడు. అప్పుడు విష్ణుశర్మ నవ్వుతూ 'అలాగే' అన్నాడు. అనడమే కాదు చెప్పనారంభించాడు కూడా.

దక్షిణదేశంలో అక్షపతి ఓ పట్టణం. అక్కడ వర్థమానుడు అనే వర్తకుడు వున్నాడు. అతని బంధువులందరూ బాగా ధనవంతులు. కాని వర్థమానుడు అందరి కంటే ఎక్కువ డబ్బు సంపాదించాలనుకున్నాడు. బుద్ధిమంతుడు విద్యాధనాన్ని, సంపాదించాలి. దాన్ని దాచుకోకుండా ధర్మం చేయాలి. వర్తకుడు ధనం సంపాదించాలి. అలా చేయాలంటే విదేశీ వర్తకం చేయాలనుకున్నాడు వర్థమానుడు.

అనుకున్నదే తడవుగా వర్థమానుడు ఒక మంచి రోజున విదేశాలకు ప్రయాణం అయ్యాడు. విదేశీయులు ఎక్కువగా కొనే వస్తువులన్నీ కొన్నాడు. వాటిని బళ్ల మీద, కంచరగాడిదల మీద, గుర్రాల మీద ఎక్కించాడు. పనివాళ్లను వెంటబెట్టుకుని బయలుదేరాడు.

అలా చాలా దూరం ప్రయాణించాడు. అలా అలా ఓ అడవిలోంచి ప్రయాణిస్తుండగా సంజీవకుడనే ఎద్దు నీరసం వల్ల బండి లాగలేక కింద పడిపోయింది. వర్థమానుడు బండి దిగాడు. ఎద్దు పరిస్థితి గమనించాడు. అది బాగా నీరసంగా వుంది. అటువంటి పరిస్థితులలో దాన్ని ముందుకు తీసుకెళ్లడంగానీ, వెనక్కు పంపడంగానీ సాధ్యంకాదని గ్రహించాడు. అందుకని అడవికి దగ్గరలో వున్న ఓ గ్రామానికి మనుషుల్ని పంపించి బలమైన ఎద్దును తెప్పించాడు. దానికి బండి కట్టించాడు. సంజీవకుడిని అక్కడే వదిలేసి ముందుకు వెళ్లిపోయాడు.

లేచి నడిచే ఓపిక కూడా లేని సంజీవకుడు నాలుగురోజుల పాటు అక్కడే వుండిపోయాడు. అక్కడే వుండి పచ్చిక తినసాగాడు. పని లేకపోవడం వల్ల ఎద్దు బాగా బలంగా తయారైంది.

ఓరోజు ఆ ఎద్దు కడుపునిండా తిని ఆనందంగా రంకెలేసింది. ఆ రంకెల శబ్దం అడవి అంతా మారుమోగింది. ఆ అడవి రాజు పింగళుడికీ ఆ ధ్వని వినిపించింది.

'ఆహా! ఈ భయంకరమైన శబ్దం ఎవరు చేశారబ్బా? బహుశా నాకన్నా బలవంతుడు ఎవరో ఈ అడవిలో వుండి వుంటారు' అనుకుని ఆశ్చర్యపోయాడు.

అదే అడవిలో కరటకుడు, దమనకుడు అనే రెండు నక్కలున్నాయి. అవి ఓ పొదచాటున నక్కి మాట్లాడుకుంటున్నాయి. ఎద్దు రంకె విని భయంతో వణికిపోతున్న సింహాన్ని దమనకుడు చూశాడు.

'కరటకా చూశావా? బలవంతుడైన మన రాజు కూడా ఆ ఎద్దు రంకె విని భయపడుతున్నాడు. నాకు ఓ ఉపాయం వచ్చింది. ఈ సమయంలో మనం కళ్లు మూసుకుని కూర్చోకూడదు. మనం రాజు దగ్గరకు పోయి ఆయన దయ సంపాదించుకుందాం పద' అన్నాడు దమనకుడు.

'దమనకా! మనకు అతని దయ ఎందుకు? చేతులారా నిప్పును నెత్తిన పెట్టుకునేవారు ఎవరైనా వుంటారా? పిలవని పేరంటానికి పోవడం మంచిది కాదు. అలా వెళితే మేకుని ఊడబీకిన కోతిలాగా చెడిపోవడం తథ్యం. నీకు నమ్మకం కుదరకపోతే ఆ కథ చెప్తా విను' అంటూ కరటకుడు కోతి కథ చెప్పడం మొదలుబెట్టాడు. అదేంటో తెలియాలంటే వచ్చే వారం వరకు ఆగాల్సిందే.

రియల్ స్టోరీ

గ్రామానికి లీడర్ ప్రజలకు డాక్టర్

పిడుగు సుబ్బరాయుడు

ఏటువంటి వాహన శబ్దమొచ్చినా గుంపులు గుంపులుగా జనం గుమిగూడే గ్రామమది. కృత్రిమ గుండెతో మనిషికి ఆయుష్షు పెంచే వైద్యం అందుబాటులో వున్న హైటెక్ యుగంలో ప్రభుత్వమందించే సాధారణ ఇంగ్లీషు మాత్రలే ఆ ఊరోళ్ళకు కరువు. నాగరికత పెరిగే తొట్టతొలిరోజుల్లో నిర్మించిన చేదుడు, దిగుడు బావులే నేటికీ ఆ గ్రామంలో తాగునీటికి దిక్కు. ఆ గ్రామంలో చేతి బోరు ఒకటి కూడా లేదంటే నేటి నాగరికతలో ఆ గ్రామమెంత వెనుకబడిఉందో అర్థమవుతుంది.

వాహనాల రాకపోకలకు రహదారే కరువైన ఆగ్రామం విద్య, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలకు ఇప్పటికీ నోచుకోలేదంటే ఆశ్చర్య పోవాల్సిన విషయమే. అంధకారమైన రాత్రుల్లో కిరోసిన్ బుడ్లే వారికి విద్యుద్దీపాలు. ఇదంతా ఏదో చదవడానికి ఆసక్తికరంగా ఉండేందుకు రాసుకున్నదనుకుంటే పొరపాటే. కడప జిల్లా చిట్వేలి మండలంలోని రాజుకుంట పంచాయతీలో ఉందా కుగ్రామం. పేరు మల్లెమడుగు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి సోమినేని సరస్వతి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గమైన రైల్వేకోడూరు నియోజక వర్గంలోని గ్రామమది. ఆ గ్రామస్తులు దైవాన్ని నమ్ముతారో లేదోగానీ ఒక వ్యక్తిని మాత్రం ఆరాధ్య దైవంగా భావిస్తారు. ప్రతి ఇంట్లో ఆ వ్యక్తి ఫొటో పెట్టుకుని ఉన్నారు. ఆయన స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడూ కాదు, మంత్ర తంత్రాలతో అభయాలిచ్చే బాబా అంతకంటే కాదు. చిన్న ఆర్ఎంపి డాక్టర్. పేరు దొండ్లవాగు చంద్రశేఖర్. నివాసం మండల కేంద్రమైన చిట్వేలి గ్రామం. ప్రస్తుతం ఆయన చిట్వేలి సర్పంచి కూడా. ఇదేందబ్బా.. ఆ డాక్టరుండేది చిట్వేలిలో. తనకేమాత్రం సంబంధం లేని కుగ్రామంలో ఆ డాక్టరు ఫొటో ఏమిటని



ఆశ్చర్యపోతున్నారా? తన వైద్య వృత్తిలోనూ, సర్పంచ్ బాధ్యతల్లోనూ ఎంత బిజీ బిజీగా ఉన్నా తరచూ మల్లెమడుగు గ్రామానికెళ్ళి వైద్యం చేయడం, ఆ గ్రామస్తుల మంచీ చెడ్డలు చూడడమే ఆయన వారికి ఆరాధ్యుడవడానికి కారణం. కొండకోనల్లో కాలినడకన సుమారు 20 కిలోమీటర్లు నడిచి మల్లెమడుగుకు వెళ్ళడం, ఒకటి రెండ్రోజులు అక్కడే ఉండి వైద్యం అందించడం చంద్రశేఖర్‌కు అలవాటుగా మారింది. పల్స్‌పోలియో కార్యక్రమం ప్రారంభం నుంచీ క్రమంగా ఆ గ్రామ వైద్య సేవలను ఆయన దత్తత తీసుకున్నారు. ఆ గ్రామంలోని ప్రతి వ్యక్తితోనూ ఆత్మీయ సంబంధం ఉన్న కారణంగా మల్లెమడుగు గ్రామస్తులు ఆయనతో కుటుంబ సమస్యలు కూడా చెప్పి సహాయ సహకారాలు తీసుకుంటుంటారు. ఇదంతా తన గొప్పదనం కాదనీ, మిత్రుడు గౌస్‌పీర్ ప్రోత్సాహమేనని చెబుతారాయన. ఈ విషయాలపై ఆయనను పలకరించిన ప్రజాశక్తితో పలు ఆసక్తికర విషయాలు చెప్పారు.

ఆశయం ఉపాధ్యాయుడు కావాలని, అబ్బింది వైద్యవృత్తి అని, అనుకోకుండా మండలకేంద్రమైన మేజర్ పంచాయతీకి సర్పంచునయ్యాననీ చెబుతారు. చిన్నప్పటినుంచీ పేదసాదలకు సేవచేయాలన్న సంకల్పాన్ని మల్లెమడుగు సేవలో నెరవేర్చుకుంటున్నానంటారు. వయసు నలభైకి పైబడినా ఇరవై అయిదేళ్ళ యువకుడిలా కనిపిస్తారు. వృత్తి ధర్మమైన వైద్యసేవలకు ప్రాముఖ్యత నివ్వడం, ఎప్పుడూ చిరునవ్వుతోనే కనిపించడం, ఎంతటి సమస్య ఎదురైనా అలవోకగా ఎదుర్కోవడం, ఎటువంటి ఒడిదుడుకులకూ లోనుకాకపోవడం వంటివి ఆయన ప్రత్యేకతలు. ప్రజాప్రతినిధిగా ఇంతకన్నా గొప్ప అవకాశమొస్తే స్వీకరిస్తారా అన్న ప్రశ్నకు ఎంతపెద్ద అవకాశమొచ్చినా తన వృత్తిని వీడి అసలైన ప్రజాసేవను వదల్లేనని సున్నితంగా సమాధానమిచ్చారాయన. తనకు అన్నా హజారే ఆదర్శమనీ, భూగర్భ జలాలు పెంచే ప్రక్రియలో తూతూ మంత్రంగా కాకుండా పకడ్బందీ అమలు కోసం తన ఇంటిముందే ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత ఈ వీధి వాసులు ఆశ్చర్య పడేలా వర్షపు నీటిని పీల్చుకుందనీ వివరించారు. ఈ స్ఫూర్తితోనే తమ పంచాయతీ పరిధిలో వర్షపు నీళ్ళు నిలిచే పలుచోట్ల ఇంకుడు గుంతలు తవ్వించాననీ చెప్పారు. ఇంతటితో ఆయన చేసే కార్యక్రమాలు అయిపోలేదు. అంతరించిపోయే ఈత చెట్లను అడవుల్లో అభివృద్ధి పరిచేందుకు ఆ విత్తనాలు విరివిగా సేకరించి మిత్రుడు గౌస్‌పీర్ సహకారంతో కడప, నెల్లూరు జిల్లాల సరిహద్దు అడవుల్లో నాటించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముగ్గురు పెళ్ళిళ్ళైన అన్నదమ్ము లున్నా వారిదిప్పటికీ ఉమ్మడి కుటుంబమే. ప్రభుత్వం పట్టించుకోని, ఆలనా పాలనా లేని కుగ్రామాలు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ కనిపిస్తాయి. వెనుకబడిన ప్రాంతాల్లో అయితే మరీను. చంద్రశేఖర్ లాంటి సర్పంచు, వైద్యుడు అటువంటి గ్రామాలకు అందుబాటులో ఉండక పోవచ్చు. ఉపాధ్యాయుడు, వైద్యుడు ఎలా ఉంటారో తెలియని, తారురోడ్డు, మోటారుకారు మొఖం చూడని ఇటువంటి గ్రామాలకు దిక్కెవరు? ★

ఇంత అసమానత న్యాయమేనా!

ముదిగంటి సుజాతారెడ్డి

పత్రిక తిరగేస్తుంటే ఒక యాడ్ మీద నా దృష్టి పడింది. అది ఒక హోటల్ యాడ్. కాంటినెంటల్, చైనీస్, మొఘలాయి వంటకాలతో బఫే! ఒక్క మనిషికి ఏడు వందల యాభై రూపాయలు! ఒక్క మనిషి ఒక్క పూట భోజనానికి ఇంత డబ్బా! - అని ఆశ్చర్యపోయాన్నేను. ఒక్కపూట ఒక్క మనిషి ఎంత తింటాడు! ఎంత ప్రయత్నించి కడుపులో కుక్కుకున్నా ఎంతని తినగలుగుతాడు! - అటువంటి ఒక్క మనిషి ఒక్క పూట భోజనానికి ఏడువందల యాభై రూపాయలేమిటి? అంత డబ్బు పెట్టి ఒక పూట భోజనం కోసం అటువంటి హోటళ్ళకు పోయి తినేవాళ్ళున్నారు - కనుకనే అటువంటి బఫేలు! - అని నేను ఆలోచిస్తున్నాను ఇంతలో లలిత వచ్చింది.

"ఏందే తెగ ఆలోచిస్తున్నావ్?" అంది.

"లల్లీ! ఒక్కపూట తిండికి నువ్వు హోటల్‌కు పోతే ఎంత ఖర్చు అవుతుందే?" అడిగాన్నేను.

"ఒక్క పూట భోజనానికా!... ఎంత?... ఇరవయ్యో, అరవయ్యో ఖర్చు అవుతుంది! ఎందుకడుగుతున్నావ్?" అడిగింది.

"ఏం లేదు. ఇక్కడ ఒక హోటల్ యాడ్‌లో ఒక్కపూట భోజనానికి ఓ రెండు వందల వంటకాలతో బఫే ఏడువందల యాభై అన్నారు. ఒక్క మనిషి ఎంతని తినగలుగుతాడు! అంత డబ్బు దండగే కద! ఇదంతా హోటల్ లాభాల కోసమే కద!" అన్నాన్నేను. "అస్సలు మన దేశంలో ఎంతోమందికి నెల ఆదాయమే ఏడు వందల యాభై వుంటుందేమో! అంటే నెలంతా కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకొని రెండు, మూడు ఇండ్లల్లో పని చేసే... ఉదాహరణకి చెప్తున్నాను.. మా పనిమనిషి లాంటి వాళ్ళ ఆదాయం అంతే వుంటుంది. ఇక మరికొందరేమో కొండల మీద నివసించే వాళ్ళు ఒకపూట భోజనానికి ఏడువందల యాభై అలా లెక్క చేయకుంటా పారేసే వాళ్ళున్నారు. ఏం చేస్తాం!" అంది లలిత.

"అంటే ఆదాయాల్లో అంత అసమానతలున్నాయి. కొందరు లక్షల్లో కోట్లల్లో సంపాదిస్తే మరికొందరు - మరికొందరేంది చాలా మంది మన దేశంలో నెలకు ఐదొందలు వెయ్యి సంపాయించే వాళ్ళే! సంపన్నులు ఎంతైనా బాధపడుకుంటూ ఫర్వాలేదు అని ఇష్టమొచ్చినంత ఖర్చు చేసే వాళ్ళున్నారు. ఇక ఎక్కువ మంది ఒక్కపూట తిండికి ఎన్నో బాధలు పడేవాళ్ళున్నారు! ఇంత అసమానత వున్నదంటే మన ప్రణాళికల్లో పాలసీల్లో ఏదో లోపముందని అనుకోవాలే!" అవునా లల్లీ! అన్నాన్నేను.

"అంతేమరి! కలవాళ్ళకు, లేని వాళ్ళకు మధ్య ఇంత అంతరం వున్న వ్యవస్థ అశాంతికి, హింసకు, చావులకు హత్యలకు నిలయమైపోతుంది" అంది లల్లి గంభీరంగా.

"పట్టణాల్లో అంతరం పోగా మన జనాభా వందకోట్లు అయితే అందులో అరవైకోట్ల మంది గ్రామాల్లో వుంటున్నారు. వారి ఆర్థిక పరిస్థితి మరింత అధ్వానమనే అనుకోవాలె. ఇంత ఆర్థిక అసమానతల వల్లనే పైపైన పట్టణాలను చూసిన వాళ్ళు ఆహా! బాగా అభివృద్ధి జరుగుతోంది! అని సంబరపడిపోతున్నారు. ఇండియా ఈజ్ షైనింగ్! ఫీలింగ్ గుడ్! అంటున్నారు. కాని పేదవాళ్ళ పేదరికాన్ని గురించి గాని, ఆకలి చావులను గురించి గాని వాళ్ళు ఆలోచించటం లేదు. ఈ అభివృద్ధి కేన్సర్ పెరుగుదల లాగానే అనిపిస్తుంది. కాని ఆరోగ్యకరమైన, అందరికీ లాభం కలిగించే ఆనందాన్ని ఇచ్చే పెరుగుదల లాగా లేదు. బుగ్గలు బూరెల్లాగా ఉబ్బించి ఫీల్‌గుడ్ అంటే కడుపుమాడే వాడు, పస్తులుండే వాడు ఏమంటాడు! ఎట్లా అంటాడు!" అన్నాన్నేను పత్రికలోని యాడ్‌లోకి మరోసారి దృష్టిసారిస్తూ.

★

ఇద్దరు మొనగాళ్ళు!

లక్ష్మి

వ్యసనం అనే పదాన్ని - అనేక సందర్భాల్లో ఉపయోగిస్తుంటారు!

అదొక మానసికమైన రుగ్మత! ఎవరెన్ని హెచ్చరికలు చేసినా డోంట్‌కేరనే గుణానికి వ్యసనమని పేరు పెట్టేరు!

పేరంటానికి వెళ్ళడం తప్పు కానేకాదు!

ఆ పేరంటంలో పాట పాడతానని పట్టుబడితే బావుండదు. మన గొంతు పాటకి సూటు కాదని అక్కడున్న అమ్మలక్కలందరికీ బాగా తెలుసు!

గత అనుభవాలను పట్టించుకోకుండా మనం ఎంతో ధీమాగా వుండొచ్చు. శ్రోతలు మాత్రం బాగా గుర్తు పెట్టుకుని ఆందోళనపడుతూ వుంటారు!

పేరంటంలో మనల్ని చూడగానే చెవులు కొరుక్కుంటారు. పాటల ప్రోగ్రాం పెట్టొద్దని ఒకర్నొకరు హెచ్చరించుకుని జాగ్రత్త పడతారు!

ఆ వాతావరణానికి తగ్గట్టు మనం కూడా మర్యాదగా ప్రవర్తించాలి. అంతేగాని పేరంటం ఇంత నిశ్శబ్దంగా వుందేమిటని ఆశ్చర్యంగా అడక్కూడదు!

మన ఉనికిని గమనించి వాళ్ళు తీసుకున్న ముందు జాగ్రత్తని పట్టించుకోకుండా - ఎవ్వరూ పాడకపోతే నేను పాడతానని డిక్లేర్ చేస్తే - పేరంటాళ్ళు యావన్మందీ వెళ్లొస్తామని లేచి నించుంటారు!

మన రాకవల్ల ఆ పేరంటంలో-

ఉండమ్మా బొట్టు పెడతా అనే మాట వినిపించదు!

ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి -

నోటికొచ్చిన పాట పాడుకోవడం ఒక వ్యసనమైతే కావచ్చు. జనాన్ని ఇబ్బంది పెట్టకూడదనే జ్ఞానం కూడా మనకే వుంది! కూడదని తెలిసినప్పుడు కోరికను చంపుకుంటాం. నోటికి తాళం వేసుకుంటాం!

మగమారాజుల్లో-

ఈపాటి జాగ్రత్తలు తీసుకునే వారి సంఖ్య చాలా తక్కువ. దిక్కుమాలిన అలవాట్లకు అంకితమై మంచీ మర్యాదలను గంగలో కలిపే జనాభా ఎక్కువ!

ఒక పిట్టకథ ప్రచారంలో వుండనే వుంది!

ఒక మారాజు చీట్లపేకలో బిజీగా వున్నాట్ట!

రామాలయం అరుగు మీద పేకముక్కలు కలుపుతున్నాట్ట!

ఆట మంచి రసకందాయంలో నడుస్తుండగా-

మారాజుగారి తండ్రి కాలం చేసేరనే వార్తని ఎవరో మోసుకొచ్చేరు. ఆ వార్త విన్న మా రాజు అయ్‌సీ అట్లాగా అంటో నాలుగైదు మాటలు ప్రయోగించి పేకముక్కలు సర్దుకుంటున్నాడు!

కనీసం శవాన్నయినా చూడవా అని ఎవరో అడిగితే - ఆట మధ్యలో ఎట్లా కుదుర్తుందని చెప్పేట్ట! వెళ్ళకపోతే బాగుండదేమో అని ఎవరో గుర్తు చేస్తే - శవాన్ని ఈదారి గుండానే శ్మశానానికి తీసుకెడతారు గదా - అప్పుడు చూస్తాన్లే అన్నాట్ట!

వ్యసనం తాలూకు వ్యవరం అల్లాటిది!

మా చినమావగారు మీకు తెలిసుండకపోవచ్చు. వారు పేక ముక్కలు తాకరు. మందుపట్ల మాత్రం మక్కువ ఎక్కువగా ప్రదర్శిస్తుంటారు!

ఇంటోవాళ్ళపోరు పళ్ళేక - ఇకముందు మందు పుచ్చుకోకూడదని ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటూ వుంటారు!

బారెడు పొద్దెక్కినా - గత రాత్రి హేంగోవరు దిగనప్పుడు సిగ్గు పడతారు. జన్మకిక తాగనని ఒట్టేసుకుంటారు!

మందుపట్ల ఆయన తాలూకు నిరసన ధోరణి సాయంత్రం వరకూ నిక్షేపంగా వుంటుంది!

సూర్యుడు దిగిపోగానే -

గుండెల్లో గంటలు మోగుతుంటాయి!

తనకై తాను బార్లో కూచుంటే వ్రతభంగమవుతుందని భయం. ఎవరైనా పిలుస్తే బావుండని - పిలుపు కోసం వెయిటింగు!

ఎవ్వరూ పిలవరు!

అందరూ చినమావగారి టైపే! ఎవరో పిలుస్తారని అందరూ వెయిటింగే!

ఇక ఓర్చుకోలేక చినమావగారే తెగించి ఒక ఫ్రెండుకి ఫోన్ చేస్తారు. అవతల ఫ్రెండు ఆనందంగా హల్లో అంటాడు!

ఈవినింగు ప్రోగ్రామేమిటని మావగారు అడుగుతారు. సుబ్బారావు కోసం ఎదురుచూస్తున్నానంటాడు ఫ్రెండు. అతనొస్తేనేగాని ఏ ప్రోగ్రాం పెట్టుకోవాలో తెలీదంటాడు!

సుబ్బారావు ఎప్పుడొస్తాడని అడుగుతారు మావగారు. వచ్చేవేళయిందంటాడు ఫ్రెండు. ఒకవేళ రాకపోతేనో అని అడుగుతారు మావగారు! ఎందుకు రాడు? తప్పకుండా వస్తాడు అంటాడు ఫ్రెండు. రాకపోతేనో నొక్కి అడుగుతారు మావగారు. వస్తాడు అని నొక్కి చెబుతాడు ఫ్రెండు!

ఎంతసేపటికీ -

ఉత్తుత్తి సుబ్బారావు ఉత్తుత్తి రాకకోసం మాటాడుకుంటారే తప్ప - వాళ్ళ మనసులోని అసలు మాట ఇద్దరూ చెప్పుకోలేరు!

చివరికి-

మావగారే ఓడిపోతాననుకునే వేళకి - మావగారి ఫ్రెండే ఓడిపోతాడు. సుబ్బారావు వస్తే జెమినీకి రమ్మని ఇంటో మెసేజ్ పెడతాను సరేనా అంటాడు ఫ్రెండు!

జెమినీ అనేది ఒకానొక బారు పేరు!

ఆ పేరు మావగారి చెవిని పడగానే మావగారి ప్రాణాలు కుదుట పడతాయి.

ఫ్రెండు అడిగితే వెడుతున్నానే గానీ లేకపోతే ఎందుకు వెడతానని అంతరాత్మతో చెప్పుకుని చెప్పుల్లో కాళ్ళు పెడతారు మావగారు.

అట్లాగే అవతల ఫ్రెండు కూడా మావగారి అల్లరి భరించలేని కారణంగా బారు గుర్తు చేసేనని సరిపెట్టుకుంటాడు!

ఎంతైనా ఇద్దరూ మగాళ్ళే కదా!

సరిబెట్టుకోడంలో ఇద్దరూ ఇద్దరే!

ఈ కథ మా చిన్నత్తగారు నాకు చెబితే - నేను మీకు చెబుతున్నాను! ★

హమ్మయ్య - పీడా వదిలింది



వీడియో కాన్ఫరెన్సు!

రుక్మిణి

గుడిలో నుండి జక్కులోడు శివాలు తొక్కుతూ... ఉగ్రాలు వూగుతూ బయటకు వచ్చాడు. వాడు తలనిండుగా చన్నీళ్ళ స్నానం చేసిన నీళ్ళు మడుగులు కదుతున్నాయి! 'సై... సై... సై... సై....' అని వీరంగం ఎందుకో అర్థం కాలేదు. ఎట్లాగూ పక్కన చప్టా మీదకు చేరతాడని యాద్గిరి బీడీకి బీడీ అంటు పెట్టి ఒకటే పీకుడు. బహు ఆనందంగా పొగ వదులుతున్నాడు. అరె... నక్కలోడు... ఫూటుగా తాగి రావి చెట్టు నీడలో తువాలందుకుని ఒకటే గెంతులు... అసలు ఇవాళ ఏదైనా పండగగానీ వుందా... పోనీ జాతర లాంటిది వుందా? వుహుఁ.. నేను బుర్ర ఎంత బద్దలు కొట్టుకున్నా సమాధానం మాత్రం దొరకలేదు. జక్కులోడు గుడిలో నుండి రానూ వచ్చాడు. వుస్సురని చప్టామీద కూలబడ్డాడు. అప్పటికే ఓ పదిమంది దాకా అక్కడ మహా వుల్లాసంగా కేరింతలు కొడుతూ వచ్చి ఆనందాన్ని ప్రకటిస్తున్నారు.

యాద్గిరి వాళ్ళనో సారి చీత్కరించుకున్నాడు. "అరె... అసలు మీ ఈ సంబరానికి కారణం ఏందిరా? ఓరి జక్కులోడా కాస్త తెప్పరిల్లి వివరంగా చెప్పరాదురా!"

అట్లా అడగంగానే జక్కులోడు ఛాతీ వుబ్బరించి ఒక ఎగశ్వాస పీకాడు. అందరూ వానివంక బిక్కుబిక్కుమని చూస్తున్నారు. వుండండి హఠాత్తుగా వాడు ఓ పెనుకేక పెట్టేసరికి అందరూ దద్దరిల్లి హాహాకారాలు చేశారు.

"ఇ.సి. జిందాబాద్... ఎలక్షన్ కమీషన్ లాంగ్‌లివ్... లివ్...! వాడట్లా అరిచేసరికి అంతా గందరగోళం... వాడట్లా ఉండుండి పెనుకేక ఎందుకు పెట్టాడో... అసలు ఈ ఎలక్షన్లింకా రెండు మూడు నెల్లుండగానే..... వీడికిదేం మాయదారి రోగం ముంచుకొచ్చిందీ... అట్లా అందరం అనుకునేంతలో తాగుబోతు నక్కలోడు... గురివిగాడు మోకాళ్ళ మీదికి బంగి చొంగలు కారుస్తూ... "అయ్యా మా తండ్రీ... మేం అందరం ఏదో ఏదో పరుకో కూడేసుకుని డొక్కుదో... సొట్టదో గా పాత సిన్మాలో... పాటలో డాన్సులో... మా ఆడాల్లయితే వరస సీరియల్స్ చూసుకుంటూ వచ్చి పడుతున్న కష్టాలను అప్పటికప్పుడు మరిచిపోయి నిద్దర్లలోకి జారుకుంటున్నాం. మా తృప్తి మాది ఆ చిన్న ప్లాసిక్కు డబ్బా టీవీలలో గడుపుకొస్తున్నాం గదరా... ఏం ఏందిరా...!"

వాడి ప్రశ్నకు అక్కడ గుమిగూడిన జనంలో ఎక్కువ మంది దీనంగా మొహాలు పెట్టి 'ఔఔ'నంటూ అడ్డదిడ్డంగా తలకాయలూపారు.

"మరి అయిదారు నెలల్నుండీ.. గదే అలిపిరి సంఘటన జరిగిన తర్వాత నుండీ అసలీ డబ్బా టీవీ అంటేనే మా పోరగాండ్లు నిద్దట్లో వులికులికి పడుతున్నారు. నా పెండ్లాం తడికవతలకు పరారు. వామ్మో... వామ్మో... (వాడు గుండెలు బాదుకున్నాడు)

"ఎందుకే" యాద్గిరి వుల్లాసంగానే అడిగాడు.

"వామ్మో... ఎక్కడి ప్రోగ్రాములు... ఇటు నారా చంద్రబాబు నాయుడుగారి బొమ్మ - వార్తీ... ప్రజల ముఖాముఖిలో మన ఎవడి బొమ్మా కనబడకపాయె! నాలుగైదు గంటలు చెంద్రబాబు మొఖం... దాన్నట్లా చూసుకుంటూ.. ఆ అబద్ధాలు వింటూ వుంటే తిన్నదంతా కడుపులో దేవి నోట్లో కొస్తుండె... ఎట్లా... యాఖ్!" నక్కలోడు సొల్లంతా కార్చాడు.

అవుడు మళ్ళా జక్కులోడు అందుకున్నాడు "అరె... వీడియో కాన్ఫరెన్సలంట్లే కలక్టర్లనూ... అధికార్లనూ అదమాయించుడే సరిపాయె.. వాళ్ళకు ఒళ్ళంతా చెమట్లు పట్టసాగె.. వామ్మో... ఈ నాలుగైదు నెలల్నుండీ రోజూ కోటి వరాలనీ... సౌకర్యాలనీ... భీమాపథకాలనీ... అబ్బో... టీవీ.. అంటేనే భయం పుచ్చుకుంది యాద్గిరన్నా...!" అందుకే ఈసీ వారి దెబ్బకు ఇకముందు ఈ ఎలక్షన్ల ముందరే ఈ పీడ తప్పిపోయిందని ఏదో ఆ దేవుడికి ఓ కొబ్బరికాయ కొట్టిపారేసిన... హమ్మయ్య! నిజవే!

రోజూ అన్ని టి.వి. ఛానళ్ళలో వీడియో కాన్ఫరెన్స్‌లు... గవర్మెంటు ఖర్చు మీద పచ్చచొక్కాల వారితో పలకరింపులు... ప్రజలతో ముఖాముఖి... ఓ రెండు గంటలు సి.ఎం.గారి వూదర భరించడం ఎవరి తరం....

"ఇంగమరి కార్లలో తిరుగుడు బందు చేసి హెలికాప్టరెక్కి దురద తీర్చుకుంటున్నాడు గదా - మంత్రులు... కలక్టర్లు... పోలీసులు... అధికార్లు బందోబస్తులు... ఒకటే లొల్లిగదా... ఎట్లా... ఇన్ని రోజులు ఆ జిల్లాలోని పేదవాండ్ల సంగతి పట్టించుకునే దిక్కేది - వురుకుడేనాయె! ఈ హెలికాప్టరు బాగోలు చూడడానికే వాండ్ల సర్కసంతా! ధు.. ఈ ఖర్చంతా కోట్లు కోట్లు ఎవడు భరించాలె.. బ్యాంకోడి దగ్గిర తెచ్చిన అప్పులన్నీ దీనికే సరిపాయె! ధు!" ఒకడు కాండ్రించి వుమ్మాడు..

ఆ వూర్లో ఒకే ఒక భాజపా నాయకుడా... ఏకైక కార్యకర్తా - పూరాగా కాషాయ అంగరఖా ధరించి ఓ చేత్తో త్రిశూలం, మరో చేత్తో ఒక పెద్ద కాగడా పుచ్చుకుని అరుచుకుంటూ అటుగా వస్తున్నాడు.

"భారత్ వెలిగిపోతుంది - ప్రపంచంలోనే ముందుకు పోతుంది. ఈ దివ్వె అందరికీ వెలుగు... వెలుగే వెలుగు..." అని అరుస్తున్నాడు గానీ, అతని చేతిలో కాగడా ఆరిపోయి వుంది. ఉత్త కర్రకాగడా పుచ్చుకుని పాపం ఒంటరిగా బేలగా అరుస్తూ బజార్ల వెంట తిరుగుతున్నాడు.

"అదేంటి సార్... వెలిగించని కాగడాతో అట్లా అరుచుకుంటూ తిరుగుతున్నారే?" జక్కులోడు అమాయకంగా రెచ్చగొడుతూ అడిగాడు.

"భారత్ వెలిగిపోతుంది... 'అంతాబాగుంది' ఈ ఇ.సి.వాండ్లు - ఎలక్షను కమిషను వాండ్లు దాన్ని ఆపలేరు... ఆపలేరు!"

"నిజవేగానీ... నిజంగా మన భారత్ అదుగో ఆ ఆరిపోయిన... పొగలు చిమ్మే కాగడాలాగానే కాలి పొగలు చిమ్ముతుంది. ఎందుకొచ్చిన తంటాలు... దీన్ని విసిరి ఆ అవతల కాలవలో పడేసి మళ్ళా త్రిశూలానికి పని కల్పించి బతకండి...

అక్కడి వారందరూ విరగబడి నవ్వారు.

"ఒరే జక్కులోడా మొత్తం 450 దినపత్రికలలో ఏడెనిమిది వందల మన ప్రజల కోట్లు ఖర్చు చేసి ఈ వ్యవహారం సాగించారు. ప్రజల డబ్బు ఖర్చు పెట్టి వాళ్ళు పెడుతున్న వూదర... దానివల్ల వాండ్లకు ఏ ప్రయోజనం లేదని పాపం వాళ్ళకు తెలవదు. అదీగాక ఇండియా నిజంగా వెలిగిపోతుంటే ఇండియాలోని న్యాయస్థానం ఈ ఖర్చు మతలబుకు తాఖీదు... జమా ఖర్చుల వివరాలు వెంటనే తెలియపరచమని తాఖీదివ్వడం నిజంగా విచిత్రంగదా... వెలిగిపోతుంది మరి...

యాద్గిరి నింపాదిగా అనడంతో అక్కడి వాళ్ళందరూ బొళబొళ నవ్వారు! ★

మధుమేహ బాధితులు పాదాల సంరక్షణ విషయంలో ఎంతో శ్రద్ధ వహించాల్సి వుంటుంది. వారు తీసుకునే చిన్న చిన్న పాదాల పరిరక్షణ చర్యలు... పూర్తిగా పాదాన్ని లేదా వేళ్ళను తొలగించాల్సిన దురదృష్టకర పరిస్థితులను పూర్తిగా తప్పించగలవు. మధుమేహం అదుపుపై సరైన శాస్త్రీయ అవగాహన లేక, వ్యాధిని అదుపులో పెట్టలేకపోవడం, శరీరానికి ప్రమాదవశాత్తు అయిన గాయాలను ప్రధానంగా వేళ్ళకు, పాదాలకు అయిన చిన్న చిన్న గాయాలను నిర్లక్ష్యం చేయడం... ఫలితంగా చివరకు ఆ భాగాలను శరీరం నుండి పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితులు ఎదురవ్వడం నేడు మనం చూస్తున్న విషయాలే.

మధుమేహం - పాదాల సంరక్షణ

డాక్టర్ రామలింగేశ్వరరావు, ఎమ్.ఎస్.

మధుమేహ (షుగర్) బాధితులకే పాదాల సమస్యలు ఎందుకు వస్తాయి ?

మధుమేహ బాధితులలోనే పాదాల సంబంధ సమస్యలు తలెత్తడానికి కొన్ని కారణాలున్నాయి. వాటిలో ప్రధానంగా పేర్కొనదగినవి...

రక్తనాళ సమస్యలు :

మధుమేహ బాధితుల శరీరంలో షుగర్ "జీవనక్రియ (మెటబోలిజమ్)"లో అసాధారణ మార్పులు చోటు చేసుకుంటాయని ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. ఈ జీవన క్రియ మార్పులు, మనం తీసుకునే ఆహార పదార్థాలలోని కార్బోహైడ్రేట్స్ (పిండి పదార్థాలు)కే పరిమితం కాకుండా, లిపిడ్స్ (కొవ్వుపదార్థాలు), ప్రోటీన్స్ (మాంసకృత్తులు)లలో కూడా మార్పులు వస్తాయి. అందువల్లనే శరీరంలోని రక్తంలో గల కొవ్వు పదార్థాలలోని ఈ అసాధారణ మార్పులు రక్తనాళాలపై ప్రభావం చూపుతాయి. ఫలితంగా కొవ్వు పదార్థాలు అసాధారణ రీతిలో రక్తనాళాల లోపల కుడ్యాలలో పేరుకుపోతాయి. దీనినే మనం శాస్త్రీయ పరిభాషలో "ఎథిరోస్క్లరోసిస్"గా పేర్కొనడం జరుగుతుంది. దీనివల్ల రక్తనాళ వ్యాసం తగ్గిపోతుంది. రక్తనాళం ద్వారా ప్రవహించే రక్తం 'పరిమాణం తగ్గిపోతుంది. రక్తనాళాలు, రక్తం సరఫరా చేసే ప్రాంతాలకు రక్త సరఫరా తగ్గిపోతుంది. రక్తనాళాలు పెళుసుగా, గట్టిగా తయారవుతాయి. కొందరి చేతికి తగులుతుంటాయి. ముఖ్యంగా పాదాలకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలలోని మార్పుల కారణంగానే... కాళ్ళలో ముఖ్యంగా పిక్కల్లో కాస్తదూరం నడిచినా నొప్పి మొదలవడం జరుగుతుంది. సరిగా రక్తసరఫరా లేక జీవకణాలకు చాలినంత ఆక్సిజన్ లేకపోవడం వల్ల ఈ నొప్పి వస్తుంది.





నాడుల సంబంధ సమస్యలు :

మధుమేహ బాధితులలో రక్తంలో షుగర్ శాతం ఎక్కువగా వుండడం వల్ల నాడీ కణజాలం, జీవన క్రియలలో అనేక అసాధారణ మార్పులు చోటు చేసుకుంటాయి. అసాధారణ మార్పులనే శాస్త్రీయ పరిభాషలో 'డయాబెటిక్ న్యూరోపతి' అంటారు. నాడులలో సంభవించే మార్పులు, నాడుల ప్రధానవిధి అయిన 'నొప్పిని తెలిపే' విధికి అవరోధాలు ఏర్పడతాయి. అందువల్ల మధుమేహ బాధితులు గాయాలను, పుండ్లను నొప్పి తెలియని కారణంగా నిర్లక్ష్యం చేస్తుంటారు. అందువల్ల గాయాలు క్రమంగా పెరుగుతూ పెద్దవి అవుతుంటాయి.

వర్థనయానకణ రక్తం :

రక్తంలో అత్యధిక స్థాయిలో షుగర్ శాతం వుంటే అనేక సూక్ష్మజీవులకు ఆ రక్తమే ఒక వర్థన యానకం (కల్చర్ మీడియా)గా తయారవుతుంది. అందువల్ల అక్కడ సూక్ష్మజీవులు చాలా తక్కువ సమయంలో వేగంగా వృద్ధి చెందుతాయి. ఫలితంగా గాయాలు పెద్దవి అవుతూ వుంటాయి. చివరకు గాంగ్రాన్‌కు దారితీస్తాయి.

గాయాలు త్వరగా మానవు ఎందువల్ల ?

సాధారణ వ్యక్తులలో కంటే మధుమేహ బాధితుల శరీరంలో రోగ నిరోధక శక్తి (ఇమ్యూనిటి) తక్కువగా వుంటుంది. దీనికి తోడు నాడుడు.. న్యూరోపతికి గురి అయినందువల్ల... నొప్పిని తెలియనివ్వవు. అందువల్ల గాయాలను అశ్రద్ధ చేయడం జరుగుతోంది. ఇంతకుముందే ప్రస్తావించినట్టుగా రక్త సరఫరా తక్కువగా వుంటుంది. దీనివల్ల తీసుకున్న మందు సరైన మోతాదులో గాయాలను చేరదు. అందువల్ల సూక్ష్మజీవులు వెంటనే నశించవు. అంతేకాక రక్తంలో షుగర్ శాతం అధికంగా వున్నందువల్ల సూక్ష్మజీవులు వేగంగా పెరుగుతాయి. అందువల్లనే మధుమేహ బాధితులలో గాయాలు, పుండ్లు త్వరగా మానవు.

పాదాల సంబంధ బాధలు ఎలా వుంటాయి?

మధుమేహ బాధితులలో పైన పేర్కొన్న

కాంప్లికేషన్ల వల్లనే బాధలు మొదలవుతాయి. ఈ బాధల స్థాయి మధుమేహం బారిన పడిన వయస్సు అంటే వ్యవధి, శరీరంలో ఆయా అవయవాలు, వ్యవస్థలలో చోటు చేసుకున్న అసాధారణతలను బట్టి ఆధారపడి వుంటుంది. ఆ బాధలు ఏమిటంటే...

- రెండు కాళ్ళలో నొప్పులు.
- మంటలు, చురుకులు.
- సూదులు గుచ్చినట్లు వుండడం
- తిమ్మిర్లు, మొద్దుబారడం.
- పాదాలు చల్లబడిపోవడం (కోల్డ్‌ఫీల్)
- స్పర్శజ్ఞానం తగ్గిపోవడం.
- తీవ్రమైన నొప్పుల వల్ల నిద్రలేకపోవడం, మానసికంగా కృంగిపోవడం (డిప్రెషన్) కూడా కొందరిలో జరుగుతుంది.
- గోళ్ళు మందంగా తయారవుతుంటాయి. కొందరిలో ఫంగస్ చేరి వుంటుంది.

పైన పేర్కొన్న బాధలన్నీ ఎప్పుడు.. ?

మధుమేహ బాధితులు రక్తంలో షుగర్ శాతాన్ని నియంత్రించుకోవడంలో... చాలా కాలం అశ్రద్ధ చేసినప్పుడు మాత్రమే పైన పేర్కొన్న బాధలన్నీ అనుభవించాల్సి వస్తుంది. మధుమేహంను తొలిదశలోనే గుర్తించి, రక్తంలో షుగర్ శాతం పట్ల శ్రద్ధ వహించే వారిలో పై బాధలన్నీ చాలా వరకు నిరోధించగలిగినవే నన్న శాస్త్రీయ వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. అప్పటికే కాంప్లికేషన్ వచ్చినా నేటి చికిత్సా పద్ధతుల ద్వారా చాలా వరకు సమస్యల్ని అదుపులో ఉంచుకొని సుఖవంతమైన జీవితాన్ని గడపవచ్చు. పాదం లేదా వేళ్ళను తొలగించే దురదృష్టకర పరిస్థితులను పూర్తిగా నిరోధించవచ్చు. అయితే అందుకు కావాల్సింది... బాధితులలో.... వ్యాధి పట్ల కాస్త శ్రద్ధ మాత్రమే. ఇంతకు ముందే చెప్పినట్లుగా చిన్న చిన్న శ్రద్ధాసక్తులు ప్రమాదకర, దర్భర జీవన పరిస్థితులను పూర్తిగా మార్చివేస్తాయి.

మధుమేహ బాధితులు చేయాల్సిందేమిటి ?

- ఆధునిక వైద్యరంగం అందిస్తున్న చికిత్సా పద్ధతుల ద్వారా... రక్తంలో షుగర్ శాతాన్ని సాధారణ స్థాయిలో మెయిన్‌టైన్ చేయడం.
- శరీరానికి గాయాలు తగలకుండా జాగ్రత్త వహించడం. ప్రమాదవశాత్తు గాయాలు అయితే వెంటనే వైద్యుని సంప్రదించి చికిత్స పొందడం.
- మద్యపానం, ధూమపానం అలవాటు వుంటే మానుకోవడం.
- పాదాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచడం అంటే... పాదాల బాగోగులు చూసుకోవడం.

పాదాల ఆ బాగోగులు ఏమిటి ?

- ప్రతిరోజూ మధుమేహ బాధితులు ఎవరి పాదాలను వారు స్వయంగా పరిరక్షించుకోవాలి.
- గోరువెచ్చని నీటితో రోజూ పాదాలను కడగాలి. వేళ్ల మధ్య సందులో పొడిగా వుండేలా చూసుకోవాలి.
- ఒట్టి పాదాలతో నడవకూడదు. నొప్పి తెలియదు కనుక గాయాలను వెంటనే గుర్తించలేము. తర్వాత అవి ప్రమాదం కావచ్చు.
- కాలివేళ్ళ గోళ్ళను సరిగ్గా కట్ చేసుకోవాలి. పక్కన అంచుల వరకు కట్ చేయకూడదు.
- కాళ్ళకు సరిగ్గా సరిపోయే చెప్పులు లేదా షూస్ వాడాలి. పట్టనివి వేసుకొని సమస్యలు తెచ్చుకోవద్దు. కాటన్ సాక్స్, లెదర్ చెప్పులు, షూస్ వాడడం మంచిది.
- వాహనాలను నడిపినా... వాహనాలలో ప్రయాణించినా.. వాహనాల వేడి సైలెన్సర్ గొట్టాలకు దూరంగా వుండాలి. నిప్పుకు దగ్గరగా కూర్చోకూడదు. వేడి తీవ్రత మధుమేహ బాధితులలో తెలియదు.
- అల్సర్‌లు వుంటే వెంటనే క్వాలిఫైడ్ వైద్యుని సంప్రదించాలి.
- పాదాలు లేదా కాళ్ళలో... శరీరంలో ఎక్కడైనా..... రంగంలో మార్పు వచ్చినా, బొబ్బలు కనిపించినా వాపు, పుళ్ళు పగుళ్ళు ఏర్పడినా వెంటనే వైద్యుని సంప్రదించాలి.

కాళ్ళకు బొబ్బలు ఏర్పడవచ్చు. తర్వాత అవి పుండ్లు అయి వేధించవచ్చు. ముందు జాగ్రత్తలతో అలాంటి సమస్యలను పూర్తిగా నిరోధించాలి. ★

మధుమేహం - గుండె జబ్బులు

మధుమేహంను "మల్టీ సిస్టమిక్ డిసీజ్"గా పేర్కొంటారని చాలా మందికి తెలిసిన విషయమే. శరీరంలోని ప్రతి అవయవం, కణంపై మధుమేహం ప్రభావం చూపుతుంది. అయితే వాటిలో ముఖ్యమైన అవయవాలపై చూపే ప్రభావం ప్రమాదకర పరిస్థితులకు, చివరకు హఠాత్ మరణాలకు దారితీయవచ్చు. అలా ప్రమాదకర పరిస్థితులను, గుండె, మూత్రపిండాలు, కంటిలోని రెటీనా తదితర అవయవాలలో ఎదుర్కోవలసి వస్తుంది.

రక్తంలో షుగర్ శాతం అసాధారణంగా పెరిగిపోయి వుండడం వల్ల సార్బిటాల్ అనే రసాయనం పెరిగిపోయి రక్తనాళాలలోని ఎండో ధీలియం దగ్గర రక్తంలోని ప్లేట్‌లెట్‌లు చేరి బ్లడ్ క్లాట్‌లకు, త్రాంబోసిస్‌కు కారణమవుతాయి. వీటివల్ల త్రాంబో ఎంబాలిజమ్ వచ్చే ప్రమాదం వుంది.

షుగర్ పరిమాణం పెరిగినందువల్ల రక్తంలో కొలెస్ట్రాల్ కూడా పెరిగిపోతుంది. ఇంటర్నల్‌మెటబోలీజన్ వల్ల షుగర్ లిపిడ్స్‌గా మారి రక్తంలో కొవ్వు శాతాన్ని పెంచుతుంది. వాటిలో గుండెను, రక్తనాళాలను పరిరక్షించే హెచ్.డి.ఎల్. స్థాయి తగ్గి, గుండెకు హాని కలిగించే ఎల్.డి.ఎల్., వి.ఎల్.డి.ఎల్., ట్రైగ్లిజరైడ్స్‌ల స్థాయి పెరుగుతుంది. ఫలితంగా రక్తనాళాలలో కొవ్వు పేరుకుపోతుంది. దీనినే శాస్త్రీయ పరిభాషలో "ఎథిరోస్క్లిరోసిస్"గా పేర్కొంటారు. ఎథిరోస్క్లిరోసిస్ వల్ల రక్తనాళాల వ్యాసం తగ్గిపోయి రక్తసరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా గుండెకు రక్తాన్ని సరఫరా చేసే 'కరొనరి రక్తనాళాలలో' ఈ ప్రభావం ఎక్కువగా కనబడుతుంది. అందువల్ల గుండెకు రక్తసరఫరా తగ్గిపోతుంది. ఇస్కీమిక్ హార్ట్ డిసిజ్ (ఇ.హెచ్.డి.)కు ఏంజినాకు దారితీస్తుంది. బి.పి. పెరుగుతుంది, గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. రక్తనాళాల వ్యాసం తగ్గిపోయిన కొద్ది వ్యాధి తీవ్రత అధికమవుతుంది. నడిచినా ఆయాసం, గుండె నొప్పి వంటి లక్షణాలు కనబడతాయి. ఒక్కోసారి కరోనరి రక్తనాళంలో పూర్తిగా అవరోధం ఏర్పడి బ్లాక్ వచ్చి గుండెపోటుకు దారితీస్తుంది. దీనినే మనం హార్ట్ ఎటాక్‌గా పేర్కొనడం జరుగుతుంది.

మధుమేహం గల వారిలో గుండె నొప్పిని తేలికగా గుర్తించలేరు. డయాబెటిక్ న్యూరోపతి వల్ల నాడులు కూడా దెబ్బతింటాయి. అందువల్ల గుండెనొప్పి తీవ్రత తెలియదు. మధుమేహ బాధితులు రక్తంలో షుగర్ శాతాన్ని కంట్రోల్‌లో ఉంచుకోవడం ద్వారా హృదయ సంబంధ కాంప్లికేషన్‌లను చాలా వరకు దాదాపు పూర్తిగా నిరోధించవచ్చు.

మధుమేహ బాధితులు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇ.సి.జి. తీయించుకోవడం ద్వారా గుండెలోని అసాధారణ మార్పులను మోనిటర్ చేస్తూవుండవచ్చు. తొలి దశలోనే ఆ అసాధారణలను గుర్తించి చికిత్స చేయడం ద్వారా ప్రమాదకర పరిస్థితులను నిరోధించవచ్చు. సంవత్సరానికి ఒకసారి ట్రెడ్‌మిల్, ఇకో కార్డియోగ్రఫి పరీక్షలు కూడా చేయించుకుంటే ఇంకా మంచిది. ప్రతి ఆరునెలలకు ఒకసారి లిపిడ్ ప్రొ ఫైల్ పరీక్ష చేయించుకోవడం ద్వారా ఎ థిరో స్క్లి రోసిస్‌ను మోనిటర్ చేయవచ్చు. నేడు హెచ్.డి.ఎల్.ను పెంచి, హెచ్.డి.ఎల్.ను వి.ఎల్.డి.ఎల్.లను ట్రైగ్లిసరైడ్‌ను తగ్గించే మార్గాలు లభ్యమవుతున్నాయి. ఆహార నియమాలు, వ్యాయామాల ద్వారా షుగర్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవడంతో పాటు, హృదయ సంబంధ వ్యాధుల్ని నిరోధించవచ్చు. అది అంతా చాలా వరకు మన చేతుల్లోనే వుంది.

- డాక్టర్ ఎన్.వెంకటరమణ, ఎం.డి.

దక్షిణాఫ్రికా స్వాతంత్ర్య చరిత్ర

దక్షిణాఫ్రికా భారతీయుల చరిత్ర మీద, 'దేశం కాని దేశం'లో వారు తమ మనుగడ కోసం, స్వేచ్ఛకోసం, హక్కుల కోసం నూరేళ్ళ పాటు సాగించిన చారిత్రాత్మక పోరాటాన్ని అక్షరబద్ధం చేసిన పరిశోధనా గ్రంథమే 'ఇంద్రధనస్సు ఏడోరంగు'.

ప్రవాస భారతీయులు ఆయా దేశాల జాతీయ జీవన స్రవంతిలో కలగలిసిపోయి వలసవాద వ్యతిరేక పోరాటంలో భాగంగా అక్కడ స్వాతంత్ర్యోద్యమాలలో, మానవ హక్కుల పోరాటాలలో పోషించిన గణనీయమైన పాత్ర గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. ముఖ్యంగా దక్షిణాఫ్రికాకు సంబంధించి, అక్కడి ప్రవాస భారతీయుల గురించి మనకు తెలిసింది గాంధీ ఉద్యమం మాత్రమే. గాంధీ దక్షిణాఫ్రికా నుండి స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత దక్షిణాఫ్రికా భారతీయుల ఉద్యమం, వారి జీవన స్థితిగతులు, సామాజిక సమస్యలు వివరించే పోరాట చరిత్రను ఇంతకాలం ఎవరూ పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం.

దక్షిణాఫ్రికా జనాభాలో మూడు శాతాన్ని మించని భారతీయులు జాతివర్గ వివక్షను తుదముట్టించే ప్రతిఘటనోద్యమానికి ఆద్యులయ్యారు. వారు జాత్యాహంకార వ్యవస్థకు వ్యతిరేకంగా దేశ ప్రజలను సంఘటితపరచి ఉద్యమం నిర్మించి, దానికి ప్రపంచ వ్యాప్తంగా మద్దతు కూడగట్టడంలో కీలకపాత్ర వహించారు. మహాత్మాగాంధీ దేశంలోని అక్రమ పాలనను ప్రతిఘటించేందుకు ప్రజలను మేల్కొల్పి అందరి గౌరవ మన్ననలను చూరగొన్నారు. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం విమోచనోద్యమానికి నాయకత్వం వహించి ప్రజలను పోరాటదిశగా నడిపిన వారిలో డాక్టర్ యూసఫ్ వాహి, డాక్టర్ జి.ఎం. నాయకర్ ముఖ్యులు. వారు శక్తివంతమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించేందుకు భారతీయులు, ఆఫ్రికన్లు ఐక్యం కావడానికి కృషి చేశారు. దక్షిణాఫ్రికా చరిత్రలో తొలిసారిగా 1955లో అన్ని జాతులకు ప్రాతినిధ్యం కలిగినా 'కాంగ్రెస్ ఆఫ్ ది పీపుల్' ఏర్పడింది. అహింసాయుతంగా నడిచే ఈ ఉద్యమాన్ని అక్కడి శ్వేత ప్రభుత్వం పాశవికంగా అణచివేయడంతో 1961లో నెల్సన్ మండేలా తదితర ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ నేతలు విప్లవపంథా మార్గాన్ని చేపట్టక తప్పలేదు. పాతికేళ్ళ నిరంకుశ పాలన తర్వాత 1983లో ఏర్పడిన యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌లో భారతీయులు నిర్ణయాత్మకమైన పాత్రను నిర్వహించారు. అక్రమ శాసనాలను, అణచివేత విధానాలను ప్రతిఘటిస్తూ లేవదీసిన ఉద్యమం ప్రజలను సాయుధ పోరాటానికి, తిరుగుబాటుకు సమాయత్తం చేయడంతో పాటు ప్రభుత్వం మీద అంతర్జాతీయ ఆంక్షలను కూడా సాధించింది. ఇవన్నీ శ్వేతజాతి దురహంకార పాలకుల మెడలు వంచి, ఉద్యమ నేతలతో రాజీ సంప్రదింపులకు దిగివచ్చేట్లు చేశాయి. ఫలితం – జాతి వివక్షా విధానానికి తెరదించి, ప్రజాస్వామ్య వ్యవస్థను నెలకొల్పడానికి ప్రభుత్వం అంగీకరించడం. మొదటి జాతీయ మండలిలో, తర్వాత పార్లమెంటుకు జరిగిన ఎన్నికలలో కూడా భారతీయులకు ఉన్నత పదవులు, మంత్రిస్థానాలు లభించాయి. ఈ పుస్తకం మొదటి భాగమంతా స్వాతంత్ర్య చరిత్రకు కేటాయించబడింది. ఈ వందేళ్ళ స్వాతంత్ర్య పోరాటంలో జైళ్ళ పాలైన వారు, జీవితాలను అర్పించిన వారు, కష్టాలను భరించిన వారు వేలాదిగా వున్నారు. వారిలో భారతీయులు కొద్ది సంఖ్యలో వున్నా, అందులో ముఖ్యమైన వారి జీవిత రేఖా చిత్రాలను రెండవ భాగంలో పొందుపరిచారు. ఇందులో ఇచ్చిన ఫొటోలు, రిఫరెన్సులు, ఈ పుస్తకం ప్రామాణికతను తెలియజేస్తాయి. ఐక్యరాజ్యసమితి అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా పని చేసిన ఇ.ఎస్.రెడ్డి ముందుమాట ఈ పుస్తకానికి మరింత వన్నెతెచ్చింది. నిరంతర పరిశోధకుడు, ప్రముఖ జర్నలిస్టు పెన్నేపల్లి గోపాలకృష్ణగారి కృషి ప్రశంసనీయం.

- కె.పి.అశోక్ కుమార్



'ఇంద్రధనస్సు ఏడోరంగు'
(దక్షిణాఫ్రికా విమోచనోద్యమం : భారతీయులు)
రచన : పెన్నేపల్లి గోపాలకృష్ణ; వెల : రు.75/-, పేజీలు : 217; ప్రచురణ మరియు ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

స్వీకారం



గబ్బిలం
రచన : గుర్రం జాషువా;
వెల : రు.25/-,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



మిరా సంపూర్ణ సాహిత్యం
ఎడిటర్ : అంబరీష దర్భా;
వెల : రు.40/-, ప్రతులకు : అప్పాజీ అంబరీష్ దర్భా, రాంషా–శిరీష మీడియా పబ్లికేషన్స్, 401, అనూషావిల్లా, బాలాజీస్వర్ణపురి కాలనీ, మోతీనగర్, హైదరాబాద్.



ఈ పొద్దుటి పూట పాట
రచన : ఒబ్బిని సన్యాసి రావు;
వెల : రు.50/-, ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్‌హౌస్; దిశ పుస్తకేంద్రం, హైదరాబాద్.

రచన : అశోక్ కుమార్; వెల :రు.15/-, ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్‌హౌస్; దిశ పుస్తకేంద్రం; నవయుగ బుక్‌హౌస్, హైదరాబాద్. మైత్రి బుక్‌హౌస్; నవోదయ పబ్లిషర్స్, విజయవాడ; సింగంపల్లి అశోక్ కుమార్, 305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతినగర్, విజయవాడ.

నెల్లూరు జిల్లా అనగానే పులికాట్ సరస్సు, అక్కడికి వచ్చే అందమైన వలసపక్షులే గుర్తుకువస్తాయి. కాని ఆ జిల్లాలో పర్యాటకులను ఆకర్షించే ఎన్నో ప్రదేశాలున్నాయి. మూడు బీచ్‌లు, పక్షి సంరక్షణ కేంద్రాలు, ఎన్నెన్నో ప్రాచీన ఆలయాలు ఉన్నాయి. పెన్నానదిపై సోమశిల వద్ద రిజర్వాయర్ చూడదగ్గ ప్రదేశం.



శేషు

అందమైన సముద్ర తీరాలు ఆహ్లాదపరిచే వలసపక్షులు

పులికాట్ సరస్సు

ఆంధ్రప్రదేశ్-తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు వద్ద సముద్రానికి చేరువలో సహజసిద్ధంగా ఏర్పడిన ఉప్పునీటి సరస్సే పులికాట్ సరస్సు. 580 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఏర్పడిన ఈ సరస్సు దేశంలో రెండవ అతిపెద్ద ఉప్పునీటి సరస్సుగా పేరుగాంచింది. ఈ సరస్సులో బోట్‌షికార్ మరచిపోలేని అనుభవం. ఇక్కడకు అక్టోబర్ నుండి మార్చి నెల వరకు అనేక దేశాల నుండి వలసపక్షులు వచ్చి నివసిస్తాయి. అవి వచ్చినపుడు సరస్సు పరిసరాల్లోని గ్రామవాసులకు పండుగే. సైబీరియా కొంగలు, పెలికాన్లు ఇలా ఎన్నో రకాల పక్షులకు పులికాట్ ఆటపట్టు. దీని తీరానే నేలపట్టు పక్షి సంరక్షణ కేంద్రం ఉంది. ఇక్కడికి అమెరికా, చైనా, అంటార్కిటికా వంటి అనేక దేశాల నుండి పక్షులు వస్తాయి. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం పక్షి సంరక్షణ కేంద్రంగా ప్రకటించింది. 486 చదరపు కిలోమీటర్ల మేర రిజర్వ్ అడవిగా ప్రకటించి పక్షులతో పాటు పులులు, సరీసృపాలు సహా అనేక జంతువులను సంరక్షిస్తున్నారు. పర్యాటక శాఖ వారు ప్రతి ఏటా ఫిబ్రవరిలో ఫ్లెమింగో ఉత్సవాలు నిర్వహించి సదస్సులు జరుపుతున్నారు.

సోమశిల

నెల్లూరు పట్టణానికి 80 కిలోమీటర్ల దూరంలో వెలికొండ కొండల నడుమ పెన్నా నదిపై సోమశిల రిజర్వాయర్ నిర్మించారు. తెలుగుగంగ కాలువ ద్వారా వచ్చే నీటిని చెన్నై నగరానికి ఇక్కడినుండే సరఫరా చేస్తారు. సోమశిలలో 7వ శతాబ్దంలో నిర్మించిన శివాలయం ఉంది. అతి ప్రాచీనమైన ఈ ఆలయానికి ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్దఎత్తున పాల్గొంటారు.

వెంకటగిరి

నెల్లూరుకు 89 కిలోమీటర్ల దూరంలోని వెంకటగిరి పట్టణం చేనేతకు ప్రసిద్ధి. అద్భుతమైన చేనేత కార్మికుల పనితనానికి నిదర్శనంగా అతి నాజూకైన, కళాత్మకతమైన చీరలు ఇక్కడ లభిస్తాయి. విదేశాలకు కూడా ఎగుమతి అవుతాయి. వెంకటగిరి జమీందారుల ప్రాచీనకోటలు ఇక్కడ దర్శనీయ స్థలాలు.

ఉదయగిరిలో 14వ శతాబ్దానికి చెందిన విజయనగర రాజులు నిర్మించిన కోట ఆనాటి వైభవానికి సాక్షీభూతంగా నిలుస్తుంది.



సముద్ర తీరాలు

నెల్లూరు పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోడూరు, 25 కిలోమీటర్ల దూరంలోని మైపాడు బీచ్‌లు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. జిల్లాలోని కృష్ణపట్టణం ఓడరేవుకు ఎంతో ప్రాచీన చరిత్ర ఉంది. చోళుల కాలంలో ప్రఖ్యాత ఓడరేవుగా విదేశీ వాణిజ్యానికి ఇది ఉపయోగపడేది. ప్రస్తుతం ఈ ఓడరేవు మంచి పిక్‌నిక్ ప్రదేశంగా గుర్తింపు పొందింది.

నెల్లూరు, సూళ్ళూరుపేట, జొన్నవాడ, కాసుమూరు, సంగం, మన్నార్ పోలూర్, పెంచలకోన వంటి ప్రదేశాల్లో ఉన్న ఆలయాలు సందర్శనీయ స్థలాలు. ధాన్యాగారంగా ప్రసిద్ధి చెందిన నెల్లూరు జిల్లాకు సరిహద్దునే గల తమిళనాడు ప్రభావంతో ఆ పేరు వచ్చింది. తమిళంలో 'నెల్' అంటే వరి అని అర్థం. వరి పండే ఊరు కనుక నెల్లూరు అయింది. ★

కళతో

మానసిక వైకల్యాన్ని జయించిన చంద్రశేఖర్

చలపాక ప్రకాష్

మనిషి జీవితం ఎంతో విచిత్రమైనది. ఎప్పుడు ఏది ఏ విధంగా జరుగుతుందో చెప్పలేము. తల్లిగర్భంలో తొమ్మిది నెలలు నులివెచ్చగా ముడుచుకు పడుకోవాల్సిన ఆ చిన్నారి ఏడవ నెలలోనే లోకాన్ని చూశాడు. తత్ఫలితం... బతకడని అనుకున్నారు. ఏదో విధంగా బతికి అందర్నీ ఆశ్చర్యపర్చాడు గాని, మానసిక వైకల్యం మాత్రం అతణ్ణి శాపగ్రస్థుడ్ని చేసింది.

ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లు డీలాగా వుండటం, శక్తి లేనట్లు, నీరసంగా వున్నట్లు కన్పిస్తాడు. చదువు మీద శ్రద్ధ లేక అతికష్టం మీద ఏడవ తరగతి వరకు చదివి చదువు అక్కడితో ఆపివేశాడు. అలాగని అతను అన్నిటిలోనూ 'పూరే' అనుకుంటే పొరపాటే. అన్నీ బాగున్నా అందరిలో లేని ప్రత్యేక 'కళ' అతనిలో భేషుగ్గా వుంది.

అది అతని చేతిలో ఏ వస్తువైనా పడితే అది అందమైన ఆకృతి దాల్చుకుని అందర్నీ అబ్బురపరచవలసిందే మరి. ఎవరు ఏ రూపం గుర్చి మాట్లాడుకుంటున్నా ఆ రూపం కళాఖండంగా కొద్ది నిమిషాల్లో రూపొందించి మన చేతుల్లో పెట్టే గొప్ప 'కళ' అతని చేతుల్లో వుంది. ఆ కుర్రాడి పేరు చంద్రశేఖర్. అతనిది చిత్తూరు జిల్లా పరదరామ స్వగ్రామమైనా మూడు దశకాల క్రితం అతని తల్లిండ్రులు బెంగుళూరులో స్థిరపడ్డారు. చంద్రశేఖర్ తల్లిదండ్రులు అశ్వథలక్ష్మి, సుబ్రహ్మణ్యంలు చాలా బీదవారు. అగర్‌బత్తీలు వుంచే గొట్టాలను తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి రెండవ సంతానమే చంద్రశేఖర్. చదువు అబ్బని చంద్రశేఖర్ ఇంట్లో ఖాళీగా వారికి భారంగా వున్నప్పటికీ, మొదట్లో ఆటా పాటలతో పిచ్చాపాటిగా బొమ్మలు అవి చేస్తూ కాలం గడిపేవాడు. చిన్నతనం నుండి మందబుద్ధిగా వుండే చంద్రశేఖర్‌కి అతని తాతగారు శ్రీనివాసులు శెట్టి పుణ్యపురుషుల కథలు, పురాణ పురుషుల కథలు చెప్పేవారు. అలాగే తనలోని శక్తిని గురించి ఆంజనేయునికి ఎవరైనా గుర్తు చేస్తే గాని గుర్తురాదని, ఏనుగుతల గల వినాయకుడు ఏ విధంగా అధినాయకుడు అయ్యాడో, బాలకృష్ణుని లీలా విన్యాసాలు తదితర విషయాలు కళ్ళకు కట్టినట్లు చెప్పేవారు. అవే అతనిలో ప్రేరణ కలిగించి జీవం ఉట్టిపడే విధమైన ఎన్నో బొమ్మలు, శిల్పకళాఖండాలు తయారు చెయ్యడానికి కారణమయ్యాయి. వినాయకుడు, ఆంజనేయుడు, లక్ష్మి, సరస్వతి, శివుడు, వెంకటేశ్వరుడు వంటి దైవరూపాలే కాకుండా, చిలుక, ఏనుగు, పులి, కంగారు, నెమలి, చరిత్రలో మనం చూసే 'మమ్మీ' రూపాలు, పురాణ పురుషుల రూపాలు ఇలా ఒకటేమిటి... అతని మదిలో ఏ రూపం మెదిలితే ఆ రూపం కళాఖండంగా సాక్షాత్కరింపబడటం అతనిలోని కళా ప్రతిభకు నిదర్శనం. గత ఏడాది ప్రపంచకప్ క్రికెట్ పోటీలు లండన్‌లో జరుగుతున్నప్పుడు స్ఫూర్తి పొంది, మైనంతో క్రికెట్ వినాయకుడి ప్రతిరూపాన్ని

చినుకు

చినుకై రాలి
కునికే నేలను
కార్యోన్ముఖం చెయ్యడం
మబ్బు తునక లక్ష్యమైతే

వేకువ జూపి
చీకటి మాపి
జగతిని జాగృతపర్చడం
ప్రభాతభానుని లక్ష్యమైతే

పసందుగా పాడి
వసంతం రాకను
ప్రచారం చెయ్యడం
ఆమని కోయిల లక్ష్యమైతే

మండుటెండకు గొడుగు పట్టి
ప్రాణికోటికి నీడనివ్వడం
వృక్షశ్రేణి లక్ష్యమైతే

అంబరంలో
సంబరంగా ఎగురుతూ
నిర్నిబంధమైన స్వేచ్ఛకు
నిర్వచనం చెప్పడం
విహంగం లక్ష్యమైతే

గలగల పారే
జల విన్యాసాలకు వేదికై
వీక్షకులను అలరించడం
సెలయేరు లక్ష్యమైతే

యుగయుగాలుగా
జగమును మోస్తూ
సహనానికి ప్రతిరూపమై నిలవడం
భూదేవి లక్ష్యమైతే

పండు వెన్నెల పూయించి
కారుచీకటిని తొలగించడం
పున్నమి లక్ష్యమైతే
చల్లని చిరుజల్లు కురిపి
మండు వేసవిని నిలవరించడరి
తొలకరి లక్ష్యమైతే-

మరి...
నీతి-రీతీ పాటించి
మానవీయ విలువలను
శిరమున దాల్చి -
మానవతయే
మానవ మతమని చాటడం-
కావొద్దా మనిషికి మహోన్నత లక్ష్యం ?

- నిమ్మల సురేంద్రరావ్

చంద్రశేఖర్ చేయగా కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ వారు అది చూసి మెచ్చుకొని చిన్నస్వామి స్టేడియంలో సందర్శకుల కోసం ప్రదర్శనకు కూడా వుంచారు. ప్రముఖ కన్నడ నటుడు రాజకుమార్ 75వ పుట్టిన రోజు సందర్భంగా ఆయన హీరోగా చేసిన బేడర (భక్త కన్నప్ప) కన్ను పెకిలించే దృశ్యాన్ని మైనంతో రూపొందించి అది రాజకుమార్‌కు బహూకరించి ఆయన అభిమానాన్ని కూడా పొందటం విశేషం.

ఒకసారి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి మైసూర్ వెళుతున్నప్పుడు ప్రయాణీకుల్లో ఒకడు చంద్రశేఖర్‌కు కాఫీబైట్ చాక్లెట్ తినమని ఇస్తే, అది తినకుండా వాళ్ళముందే వినాయకుడి బొమ్మగా మలిచి వాళ్ళని ఆశ్చర్యచకితుల్ని చేశాడు. ఇదే కాకుండా పేపర్లతో బొమ్మలు, మైనం, సబ్బు, చాక్‌పీస్, విభూది, పెన్సిల్ లెడ్‌లపై కూడా అద్భుత కళాఖండాలను తీర్చిదిద్దటం ఇతని చేతిలో దాగి వున్న కళా ప్రతిభకు నిదర్శనం. మైనంతో రూపొందించిన బొమ్మలు, చాక్‌పీస్‌పై చిన్న చిన్న ప్రతికృతులు, బియ్యపు గింజలో పావు భాగం కూడా వుండని చాక్‌పీస్ భాగంపై వందలాది డిజైన్లలో బొమ్మలు తయారు చేయటం ద్వారా ప్రత్యేకంగా సందర్శకుల అభినందనలు అందుకొంటున్నాడు చంద్రశేఖర్. (ఇవి వీక్షించేందుకు సూక్ష్మదర్శినులు తప్పనిసరవుతాయి) అలాగే సెంటీమీటరు మందం వుండే చాక్‌పీస్‌ను నాలుగు ముఖాలపై నాలుగు వినాయకులతో పాటు దాన్ని తొలచి దాంట్లో మరో వినాయకుడు వుండే విధంగా చూపరులను అబ్బురపరిచే కళా ప్రతిభ చాటుకున్నాడు చంద్రశేఖర్. అంగారక గ్రహంపైన రోవర్ వాహనాన్ని, స్టార్‌వార్స్ సినిమా, సీరియల్స్‌లో వచ్చే మనుషులు, రోబోలు, విచిత్ర జంతువుల రూపాలు పేపర్ సహాయంతోనే రూపొందించాడు. ఇలా అతని ప్రతిభ చెప్పుకుంటూ పోతే చాలా వుంటుంది. కాని ఒక్కమాటలో చెప్పాలంటే లండన్‌లో టుస్సాడ్ మ్యూజియంలో వున్నటువంటి ప్రతిరూపాలను తయారు చేయటానికి సైతం తాను సిద్ధంగా వున్నానని చెప్పే చంద్రశేఖర్‌లోని ఆత్మవిశ్వాసం, అతని హస్త కళా ప్రతిభ ఏ స్థాయికి చేర్చిందో ఆ మాటలోనే చెప్పవచ్చు. ఈ కళలో ఎటువంటి గురువు లేకున్నా, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అబ్బురపరిచే ఇన్ని కళాప్రతిమలను తయారు చేయటం చంద్రశేఖర్ గొప్ప కళాకారుడిగా ఎదగగలడనటానికి దోహదం కానున్నాయి. మొదట్లో పనీపాటా లేకుండా ఈ బొమ్మలు తయారు చేయటం ఏమిటని తల్లిదండ్రులు చంద్రశేఖర్‌ను వారించినా, చివరికి తమ కుమారుడి దాగి వున్న ఈ గొప్పకళతో తమను సైతం ఈ ప్రపంచం ప్రత్యేకంగా గుర్తించటం, అభిమానంతో ముంచెత్తటం తమకెంతో ఆనందంగా వుందంటున్నారు. వివిధ సంస్థలు చంద్రశేఖర్‌లోని ప్రతిభను, అతను చేసే

కళాఖండాలను మెచ్చి ప్రదర్శనలకు అవకాశమివ్వటం, బహుమతులతో సత్కరించటం తమ వంటి బీదవారికి ఎంతో ఉత్తేజకరం, ఎంతో గర్వకారణం అని అంటారు చంద్రశేఖర్ తల్లిదండ్రులు మెరిసే కళ్ళతో ఆనందంగా. కళాకారుడిగా ఉజ్వల భవిష్యత్తు వున్న చంద్రశేఖర్‌ను ఈ సందర్భంగా మనమూ అభినందిద్దాం. ★

ఓటు

నిండా మునిగినం
పాలకులూ ప్రకృతీ కూడబలుక్కున్నట్టు
హఠాత్తుగా కురిపించిన వ'రాల' వానల
నిండా మునిగినం

వెనకటికెవడో
మబ్బుల్ని చూసి నీళ్ళాలక బోసుకున్నాట్ట
అట్లా వుంది రాజకీయం
ఇది 'ముందస్తు రుతువు' మాయాజలం

ఉన్నట్టుండి వాతావరణం మారిపోయింది
ఆశ్చర్యంగా నత్తనడక కుందేటి పరుగైంది

డొక్కలు పీక్కుపోయినా అందిరాని కనీసావసరాలు
అపర దేవుళ్ళు కురిపించే అనుకోని వ'రాల' జల్లులైనై
కళ్ళు కాయలు గాసినా కానరాని అభివృద్ధి పనులు
కళ్ళలో దుమ్ము కొట్టుకొంటూ రువ్వడిగా సాగిపోతన్నై
ఏండ్లూ పూండ్లూ గడిచినా కదలని శంకుస్థాపన రాళ్ళు
వేళ్ళ మీది దినాల్లో రెక్కలు విప్పుకుంటున్నాయ్

ఇన్నాళ్ళూ ఐ.టి. కళ్ళజోడుతో
ఊరేగిన హైటెక్ ముఖపోడు
మట్టి ముఖాన్ని తగిలించుకొని

ఆ కళ్ళజోడు తొలగించుకొని
మట్టినీ మట్టి మనుషుల్ని చూస్తానంటున్నాడు
కాస్తానంటున్నాడు
ప్రజలే నా దేవుళ్ళంటున్నాడు.

దేవుడై వరాలు కురిపించేటోడు
ప్రజల్ని దేవుళ్ళనడం 'ఇచ్చింత్రం' కాదా!
తన ప్రోగ్రెస్ రిపోర్ట్ తానే ప్రకటించుకొనే
అంకెల గారడీ చేసి బురిడీకొట్టించే
మాయల మరాఠీ
ఆకలి చేతులకు ఆయుధాలిస్తానంటున్న
అరాచకవాది
తనకు తప్ప ఓటేస్తే ఖబర్దార్ అని
హెచ్చరిస్తున్న ప్రజాస్వామ్య నియంత

మాయల ఫక్కీరు ప్రాణం
ఏడేడు సముద్రాల అవల
మర్రితొర్రలో చిలుకలున్నట్టు
వీని ప్రాణం
ప్రపంచ బ్యాంకు చేతిలున్నది
బిల్‌గేట్స్ జేబులున్నది
అంతకుమించి
తెలుగు ప్రజల 'ఓటు'లున్నది

- నూటెంకి రవీంద్ర

ADVOCATE

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

రుణం పొందడం ఎలా?

మాకు సైకిల్‌రిక్షాల ద్వారా నెలకు ఖర్చులు పోను రు.5 వేలు మిగులుతాయి. మా అమ్మకు పుట్టింటివారు ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మాణం ప్రారంభించగా మేము వేసుకున్న ఎస్టిమేషన్ దాటింది. మా ఇంటి నిర్మాణం పూర్తి చేయడానికి రుణం కావాలి. మా స్థలం ష్యూరిటీగా పెట్టుకొని రుణంగా సొమ్ము ఇవ్వడానికి ఏ బ్యాంక్‌ను సంప్రదించాలి? ఇక్కడ సమస్య ఏమిటంటే మా అమ్మకు సంక్రమించిన స్థలం రెండు తరాల పూర్వానిది. దానికి ఎలాంటి కాగితాలు లేవు. కాబట్టి దానికి సంబంధించిన ఎలాంటి డాక్యుమెంట్స్ లేవు. ఆ స్థలం 60 సంవత్సరాల నుంచి ఖాళీగానే వుంది. మా అమ్మమ్మ మా అమ్మకి ఈ మధ్యనే రిజిస్ట్రేషన్ చేసింది. కాని బ్యాంక్‌లో ఈ రిజిస్ట్రేషన్ చెల్లదంటున్నారు. దానికి లింకు డాక్యుమెంట్ కావాలని చెబుతున్నారు. అది ఎక్కడ దొరుకుతుంది? తెలియచేయగలరు.

– షేక్‌మౌలాలి, ఊరుపేరు లేదు.

'లింక్ డాక్యుమెంట్స్' లేకుండా ఏ బ్యాంకు లోన్ ఇవ్వదు. ఎలాంటి రశీదులు కూడా లేవంటున్నారు. కావున ఏ బ్యాంకులోను లోన్ వచ్చే అవకాశం లేదు. బ్యాంక్ మేనేజర్ మీరు చెప్పే ఆదాయ వివరాలతో సంతృప్తి చెందితే, అతను ఒప్పుకుంటే పి.ఎమ్.ఆర్.వై. లాంటి ప్రభుత్వ స్కీమ్‌లకు దరఖాస్తు చేసుకుని మీ రిక్షాలను చూపించి దానికి తగినట్లుగా గవర్నమెంట్ ఉద్యోగుల ష్యూరిటీ ఇవ్వగలిగితే మీకు పర్సనల్ లోన్ లభించే అవకాశం ఉంది.

ఎన్నికల్లో పోటీ చేయవచ్చా?

మేము 1977లో శ్రీకాకుళం నుండి విజయనగరం జిల్లాకు వెళ్ళి స్థిరపడిపోయాము. రేషన్ కార్డు మా నాన్నగారి పేరున 1978లో వచ్చింది. మేము ఎన్నికల్లో పోటీ చేయడానికి స్థానికులుగా ఫరవాలేదా! ఒకవేళ పోటీకి నిలబడితే అపోషిజన్ వాళ్ళు స్థానికేతరులు అని కోర్టుకు వెళ్ళే అవకాశం ఉందా ? మీ సలహా ప్రకారం స్థానిక ఎలక్షన్స్‌లో పోటీకి నిలబడాలని అనుకుంటున్నాను. ఈ లెటర్ అందిన వెంటనే సరైన సలహా ఇవ్వగలరని ఆశిస్తున్నాను.

– ఎస్.ఎస్.ఎస్. పార్వతీపురం.

మీరు 1977 నుండి అక్కడ స్థిరనివాసం ఉంటున్నారన్నారు. కాబట్టి మీరు ఆ ప్రాంతం వారిగా పరిగణించబడలేరు. మీకు రేషన్ కార్డు ఉందన్నారు. కాని దాంతో పాటు ఓటర్స్ లిస్టులో మీ పేరు ఉందా లేదా అని రాయలేదు. బహుశ ఉండి ఉండొచ్చు. మీ పేరు ఓటర్‌లిస్టులో ఉంటే మీరు ఎన్నికల్లో పాల్గొన వచ్చు. మీ ప్రత్యర్థివర్గం కోర్టుకు పోయే అవకాశం లేదు. కాని మీ పాత గ్రామంలోని ఓటర్ లిస్టులో మీ పేరు లేకుండా చూసుకోండి. ఆ గ్రామంలో ఉండి ఉంటే దాన్ని చూపిస్తూ వాళ్ళు 'అబ్జెక్షన్' చెబుతారు. అంతేకాకుండా అది చట్టప్రకారం తప్పకూడా.

నా కుమారుడిని నేను పొందగలనా?

1994న పెద్దల సమక్షంలో మా వివాహమైంది. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత పెండ్లి కంటే ముందు ప్రేమించిన వ్యక్తితో నా భార్య వెళ్ళిపోయింది. ఆ ప్రాంతపు పెద్ద మనుషులు, మా నాన్న గారిని పిలిపించి, గ్రామ పంచాయితీ ద్వారా నా భార్య చేత విడాకులు రాయించి ఇచ్చారు. తద్వారా నా కాపురం పతనమై, బాబు వారి అధీనంలోనూ, పాప నా దగ్గర ఉన్నారు. బాబును పంచాయితీలో వారి అధీనంలో ఉంచారు.

ఇంతకాలం పేదరికం వల్ల కోర్టు ఫీజులు కూడా భరించలేని నిస్సహాయ స్థితిలో వారిపైన ఎటువంటి కేసులు పెట్టలేదు. ప్రస్తుతం అతనిపైన కేసు అప్పీలు చేయడానికి ఆస్కారం ఉందా? నా కుమారుడు నాకు లభించగలడా? ఉచిత న్యాయం కోసం ఏ కోర్టును, ఎవరిని ఆశ్రయించాలి? దయచేసి న్యాయ సలహా ఇవ్వగలరని కోరుచున్నాను.

– జానయ్య, రామాయపల్లె, కడప

గ్రామాల్లో నేటికీ నిరక్షరాస్యత వల్ల విడాకులు పెద్దమనుషుల సమక్షంలోనే జరుగుతున్నాయి. పెద్ద మనుషులకు పెళ్ళి చేసే హక్కు ఉంది గాని విడాకులు కావాలంటే ఇచ్చే హక్కులేదు. విడాకులు కావాలంటే చట్టప్రకారం కోర్టులో తీసుకోవలసిందే. మీకు ఇచ్చిన విడాకులు చట్టపరంగా చెల్లవు. మీరు మీ భార్యపై (ద్వితీయ వివాహం చేసుకున్నందుకు గాని) అక్రమ సంబంధం కలిగి ఉన్నందుకు కేసు పెట్టవచ్చు. మీ భార్యను పెళ్ళిచేసుకున్న సైనికోద్యోగి కూడా నేరస్తుడే అవుతాడు. మీ దగ్గరలోని ఫ్యామిలీ కోర్టులో కొడుకుని కూడా మీరే సాదుకుంటానని 'వార్డ్ గార్డియన్స్ యాక్ట్' ప్రకారం తనను మీకు అప్పగించవలసిందిగా కేసు వేయవచ్చు. కాని చట్టప్రకారం 12 సంవత్సరాల వరకు తల్లి వద్దనే ఉంచుకోగలదు. మీరు ఆ బాబుని వారానికోసారిగాని, కొన్ని రోజులకు గాని కోర్టు తీర్పు ప్రకారం మీ పరిధిలో ఉంచుకోగలుగుతారు. 12 సంవత్సరాల తర్వాత మాత్రం మీకే చెందుతాడు. ఉచిత న్యాయం కోసం మీ దగ్గరలోని జిల్లా కోర్టులో లీగల్ సర్వీసెస్ అథారిటీ వారిని సంప్రదించగలరు.

రుచి

పూరీ

కావలసిన వస్తువులు:

గోధుమ పిండి: ఒక కప్పు

మైదా: ఒక కప్పు

బొంబాయి రవ్వ: రెండు టేబుల్ స్పూన్లు

నీరు: ఒక కప్పు

ఉప్పు: తగినంత

నూనె: వేయించేందుకు తగినంత

చేసే విధానం: గోధుమ, మైదా పిండిని జల్లించుకోవాలి. వీటిలో ఉప్పు, రవ్వ వేసి పూరీ పిండిని కలుపుకోవాలి. ఇలా కలిపిన పిండిని ఒక గంటసేపు నాననివ్వాలి. పొయ్యి మీద బాండీ పెట్టి నూనె పోసి కాగిన తరువాత పూరీలను బంగారు రంగు వచ్చేలా కాల్చుకోవాలి. పూరీలను పిండివేసి కాకుండా కొద్దిగా నూనె రాసి చేస్తే బాగుంటుంది. నూనెలో పిండిపడి మాడిపోయి నల్లగా కాకుండా ఉంటుంది.

జిలేబి

కావలసిన వస్తువులు:

మైదాపిండి: రెండు కప్పులు

పంచదార: రెండు కిలోలు

బియ్యం పిండి: రెండు కప్పులు

పుల్లటి మజ్జిగ: రెండు కప్పులు

వంట సోడా: చిటికెడు

నెయ్యి లేక నూనె: ఒకటిన్నర కిలో

చేసే విధానం: ముందుగా బాగా మందంగా ఉన్న గుడ్డకు చిన్న బెజ్జం పెట్టి ఉంచుకోవాలి. తరువాత ఒక పాత్రలో బియ్యం పిండిని, మైదా పిండిని, పుల్లని మజ్జిగను, వంటసోడాను, తగినన్ని నీళ్ళను కలిపిపెట్టాలి. గరిటె జారే విధంగా కలుపుకోవాలి. సుమారు పది గంటల వరకు పిండిని నానబెట్టాలి. బాగా నానిన ఈ పిండి బురబురలాడుతూ వేళ్ళతో పట్టుకుంటే తీగలాగా వస్తుంది. తరువాత స్టవ్‌మీద మూకుడు (బాండీ) పెట్టి నెయ్యి పోసి మరగపెట్టాలి. నెయ్యి కాగగానే రెడీగా ఉంచిన పిండిని చిల్లిఉన్న గుడ్డలో గరిటెతో పోసి గుడ్డ చుట్టూరా మూసి కాగుతున్న నెయ్యిలో గుండ్రంగా, చక్రాల్లాగా వత్తాలి. ఎర్రగా కాలిన తరువాత తయారు చేసుకొని ఉంచిన పంచదార పాకంలో వేసి క్షణం ఉంచి తీసివేయాలి. ఇలా పిండి మొత్తాన్ని చేసుకొని జాగ్రత్త చేసుకుంటే వారం రోజుల వరకు నిల్వ వుంటాయి.

గమనిక

ఆదివారం అనుబంధంలో రుచి శీర్షిక మీరు చూసే ఉంటారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు వివిధ వంటకాలకు ప్రసిద్ధి. ఆసక్తి గల వారు ఆయా జిల్లాల్లో ప్రసిద్ధమైన వంటకం గురించి, దాని తయారీ విధానం గురించి రాసి పంపితే ప్రజాశక్తిలో ప్రచురిస్తాము. వంటకం ఫొటోతో పాటు రాసిన వారి ఫొటో కూడా పంపవలెను.

వంటలు పంపవలసిన చిరునామా:

రుచి, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, అశోక్‌నగర్, హైదరాబాద్ 20

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్థసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది